

www.vibharenews.com
# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 06-05-2023 సంపుటి : 04 సంచిక : 220 పేజీలు : 4 వెల : రూ 3-00

## ఉగ్రవాదుల కుట్రను బహిర్గతం చేసిన కేరళ ఫైల్స్

కాంగ్రెస్ ఉగ్రవాదులతో కలసి కుట్రపూరిత రాజకీయం

కర్నాటక ప్రచారంలో విరుచుకు పడ్డ ప్రధాని మోడీ





బెంగళూరు,మే5 : ది కేరళ ఫైల్స్ మూవీపై ప్రధాని మోడీ తొలిసారిగా స్పందించారు. కేరలో జరుగుతున్న ఉగ్రవాద కుట్ర సత్యాన్ని ఈ సినిమాలో బయటపెట్టారని మోడీ తెలిపారు. మే 10న కర్ణాటకలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బళ్లారిలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో మోడీ పాల్గొన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ మాత్రం ఉగ్రవాదులతో కలిసి కుట్రపూరిత రాజకీయాలకు తెరలేపు తుందని ఆరోపించారు. వారకి అండగా ఉంటూ తెరవెనుక రాజకీయలు చేస్తోందని మండిపడ్డారు. తీవ్రవాదం, ఉగ్రవాద ధోరణులపై తీసిన ది కేరళ్ ్ ÷ల్స్ సినిమాను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని మోడీ అన్నారు. ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ ఉగ్రవాదాన్ని కాపాడతుందోని తీవ్రమైన ఆరోపణలు గుప్పించారు. మరి అలాంటి కాంగ్రెస్ పార్టీ కర్ణాటకను కాపాడగలదా అని ప్రశ్నించారు. కర్ణాటకను నంబర్ వన్ రాష్ట్రంగా మార్చేందుకు భద్రతా వ్యవస్థ, శాంతిభద్రతలు అత్యంత ముఖ్యమైనవని చెప్పారు. ఉగ్రవాదంపై బీజేపీ ఎప్పుడూ కఠినంగా వ్యవహరిస్తోందని మోడీ స్పష్టం చేశారు. కాంగ్రెస్ గెలుపు కోసం తప్పుడు కథనాలు, సర్వేలు చేస్తుందని, రాష్ట్రంలోని ఓటర్లను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నదని మోడీ విమర్శించారు. కాంగ్రెస్ మేనిఫెస్టో అంతా బుజ్జగింపుల గురించి, నిషేధాల గురించి ఉందని ఎద్దేవా చేశారు. యడ్యూరప్ప, బొమ్మై నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వానికి మూడున్నరేళ్ల మాత్రమే ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందని మోడీ తెలిపారు. మరోసారి బీజేపీకి కన్నడ ప్రజలు అధికారం ఇవ్వాలని, కర్నాటకను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా మారుస్తామని ఈ సందర్భంగా మోడీ హామీ ఇచ్చారు.

## తాలిబన్ల కంటే దారుణంగా వైసిపి పాలన



కర్నూలు,మే5 : రాష్ట్రంలో వైసీపీ పాలన తాలిబన్ల కంటే దారుణంగా తయారైందని టీడీపీ యువనేత నారా లోకేష్ అన్నారు. రాష్ట్రంలో గత నాలుగేళ్లుగా నిర్బంధాలు, బెదిరింపులు, భూకబ్జాలు నిత్యకృత్యంగా మారాయన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని సమస్యలు తీరుస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర జిల్లాలోని పాణ్యం నియోజకవర్గంలో కొనసాగుతోంది. శుక్రవారం 90వరోజు పాదయాత్ర పెద్దకొట్టాల నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా యువనేతను పలు గ్రామాల ప్రజలు కలిసి తమ సమస్యలు తెలియజేస్తున్నారు. ముందుగా మార్కాపురం గ్రామస్తులు లోకేష్ కలిసి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అరాచకాలను వివరించారు. ఎమ్మెల్యే తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని తెలిపారు. అనంతరం పాణ్యం నియోజకవర్గం కె.మార్కాపురం నేషనల్ హైవేపై లోకేష్‌ను కురబ సామాజిక వర్గీయులు కలిసి వినతిపత్రం సమర్పించారు. యువనేత మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా గొర్రెల మేపుకోసం గతంలో కేటాయించిన భూములను వైసీపీ నేతలు ఆక్రమించారని మండిపడ్డారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో ఖాళీగా ఉన్న బంజరు భూములను గొర్రెలమేపుకు కేటాయిస్తామని తెలిపారు. 22 గొర్రెలు యూనిట్‌గా సబ్సిడీపై గొర్రెల కొనుగోలుకు రుణాలు ఇస్తామన్నారు. గతంలో ఇచ్చిన జీవోలు, గెజిట్‌లు పరిశీలించి మాదాసి కురవ, మాదారి కురవలకు

నిర్బంధాలు, బెదిరింపులు, భూ కబ్జాలు

టిడిపి అధికారంలోకి రాగానే సమస్యలు తీరుస్తాం

పాదయాత్రలో పలు గ్రామస్థులు కలసి సమస్యలపై వినతి

90వ రోజుకు చేరుకున్న యువనేత లోకేశ్ పాదయాత్ర

న్యాయం చేస్తామని చెప్పారు. కంబళ్ల తయారీకి ఉన్నిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని లోకేష్ హామీ ఇచ్చారు. అనంతరం పాదయాత్రగా వెళ్తున్న లోకేష్‌ను పాణ్యం నియోజక వర్గం ఎ.గోకులపాడు గ్రామస్తులు కలిశారు. లోకేష్ స్పందిస్తూ... రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడానికి కూడా నిధుల్లేకుండా చేశారన్నారు. గత ప్రభుత్వం తాను పంచాయితీ రాజ్ మంత్రిగా ఉన్నప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో 25 వేల కిలోమీటర్ల సిమెంటు రోడ్లు వేసినట్లు గుర్తుచేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. గోకులపాడులో నిలిచిపోయిన ఎంపీయూపీ స్కూల్, మెటల్ రోడ్డు, డ్రైనేజి, హౌసింగ్ బిల్లులు, పశువుల ఆసుపత్రి సమస్యలను పరిష్కరిస్తామని యువనేత భరోసా ఇచ్చారు.ఆపై టీడీపీ యువనేతను నెరవాడ గ్రామస్తులు కలిసి తమ సమస్యలను విన్నవించగా లోకేష్ మాట్లాడుతూ.. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టులు, బ్రిడ్జిల నిర్వహణను గాలికొదిలేశారని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి, 61 నిండుప్రాణాలు బలయ్యాయన్నారు.



## వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేత బొమ్మిరెడ్డి రాఘువేంద్రరెడ్డి



అమరావతి: నెల్లూరు మాజీ జెడ్పీ ఛైర్మన్, టీడీపీ నేత బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. శుక్రవారం.. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆయనకు వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బొమ్మిరెడ్డితో పాటు నెల్లూరు జిల్లా ఆత్మకూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, టీడీపీ నేత ఇందూరు వెంకటరమణా రెడ్డి వైఎస్‌ఆర్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యేలు మేకపాటి విక్రమ్ రెడ్డి, వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు.

## అమరావతి పేదల ఇళ్ల పట్టాల పంపిణీకి హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

అమరావతి: అమరావతి పేదల ఇళ్ల పట్టాల పంపిణీకి ఏపీ హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జీవో నెం.45పై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని దాఖలైన పిటిషన్ కోర్టు కొట్టివేసింది. ప్రభుత్వం తరపున అడిషనల్ ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ప్రభుత్వ వాదనతో ఏపీ హైకోర్టు ఏకీభవించింది. ఇళ్ల స్థలాల పంపిణీ కోర్టు తీర్పుకు లోబడి ఉండాలని, రాజధాని ఏ ఒక్కరికో.. ఒక వర్గానికో పరిమితం కాదని.. పిటిషన్ విచారణ సందర్భంగా సీజే ప్రశాంత్‌కుమార్ మిశ్రా కీలక వ్యాఖ్యలు చేశారు. రాజధాని ప్రజలందరిది. రాజధానిలో పేదలు ఉండకూడదంటే ఎలా అని ధర్మాసనం ప్రశ్నించింది.”రాజధాని ప్రాంతంలో ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడం అభివృద్ధిలో భాగమే. పలానా వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వొద్దని చెప్పడం కరెక్ట్ కాదు. రాజధాని భూములు ప్రస్తుతం సీఆర్డీఏవే. భూములు వారివి కావు. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయంపై కోర్టును ఆశ్రయిస్తున్నారు. రాజధాని విషయంలో కొన్ని అంశాలు హైకోర్టులో.. కొన్ని అంశాలు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. నిర్ణయాలు తీసుకోకుండా ప్రభుత్వాన్ని నిరోధించలేం. నిర్ణయాలు తీసుకోవడం ప్రభుత్వం విధుల్లో భాగం” అని హైకోర్టు స్పష్టం చేసింది.



## గోనె సంచులు కూడా సరఫరా చేయలేరా?

కౌలు రైతులను ఆదుకోవడంలో విఫలం

జగన్ ది దద్దమ్మ ప్రభుత్వం అన్న చంద్రబాబు



కోనసీమ,మే5: రైతులకు గోనె సంచులు కూడా సరఫరా చేయలేని దద్దమ్మ ప్రభుత్వం వైకాపా ప్రభుత్వం అని మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ నాయకులు చంద్రబాబు నాయుడు విమర్శించారు. కౌలు రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫల మైనీదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల దయనీయ పరిస్థితిని పరిశీలించేందుకే తాను ఉభయగోదావరి జిల్లాలో పర్యటించాలని ఆయన వివరించారు. రెండు రోజులు జిల్లా పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం రామచంద్రాపురం నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అకాల వర్షాల వల్ల కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని వారి అందరిని ప్రభుత్వమే ఆదుకోవాలని అన్నారు. ముఖ్యమంత్రి నాలుగేళ్లగా ఎప్పుడూ పంట పొలాలకు పోయి రైతులను పరామర్శించలేదన్నారు. అదేవిధంగా మంత్రులు అధికారులు కూడా రైతులను పట్టించుకోవటం లేదని ఆయన ఆరోపించారు. అదేవిధంగా అక్కర్లేని నిబంధనలతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఎకరా రైతు 53 బస్తాల కంటే ఎక్కువ అమ్మ రాదని, 12 ఎకరాలు పైగా పండిస్తే గోదావరిలో దూకాలా అని ఆయన ఏద్దేవా చేశారు. రామచంద్రపురంలోని మంత్రి వేణు తనను విమర్శించడం తప్ప ప్రజలకు చేసేదేమీ లేదని, విమర్శిస్తే ఏమి రాదని జనంలోకి వెళ్లి పని చేయాలని చంద్రబాబు సూచించారు. అదేవిధంగా పలువురు రైతులతో ఆయన నేరుగా మాట్లాడారు. అనంతరం నాయకులు కార్యకర్తలంతా కౌలు రైతులకు అండగా ఉండాలని ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువచ్చి మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా పనిచేయాలని ఆయన సూచించారు.

పర్యటనలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నియోజకవర్గంలోని వేగాయమ్మ పేట గ్రామంలో రైతులు ఆరబెట్టుకున్న ధాన్యం రాశులను మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించారు. ఇక్కడ రైతులతో మాట్లాడారు. ఎకరాకు 30 నుంచి 40 బస్తాలు కౌలిచ్చి పంటలు పండిస్తున్నారు అని తొలకరిలోనే భారీ వర్షాలకు పంచ నష్టం ఏర్పడిందని ఇప్పుడు వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మరింత నష్టం వాటిని ఆయన అన్నారు.

గతంలో ఎఫ్ సి ఐ ఫుడ్ కార్పొరేషన్ సివిల్ సప్లై రైస్ మిల్లర్లు కలిసి కొనుగోలు చేసి రైతులను ఆదుకునే వారిని ఇప్పుడు గోన సెంచులు కూడా అవినీతి ఏర్పడిందని నిబంధనలను పేరుతో రైతులను ఆత్మహత్యలకు పురిగొల్పుతున్నారని అన్నారు. చె÷–లలెలు పాడిన ధాన్యం సంచులతో పాటు ధాన్యం బాగాలేదని నూక వస్తుందంటూ రైతు దగ్గర రెండు వందల నుండి 300 రూపాయలు నష్టం కలగ చేస్తున్నారని చంద్రబాబు వివరించారు. మొత్తం ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దాల్వా పంటకు ఇన్సూరెన్స్ కూడా కట్టలేదని ఆయన అన్నారు. బొక్కటం తెలిసిన ముఖ్యమంత్రికి బటన్ నొక్కటం తెలియదా అంటూ వ్యంగ్యంగా మాట్లాడారు. తమ కార్యకర్తలపై పోలీసు వేధింపులు



అధికమయ్యాయని తాను అన్ని లెక్కపెట్టుకుంటానని అన్ని లెక్కలు తేలుస్తానని పోలీసులు ఓవరాక్షన్ తగ్గించుకోవాలని ఆయన హితవు పలికారు. ఆయన వెంట నియోజకవర్గ ఇన్చార్జ్ రెడ్డి సుబ్రమణ్యం, అమలాపురం పార్లమెంట్ పార్టీ నాయకులు గంటి హరీష్ మాధుర్, పార్టీ నాయకులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, పత్తిపాటిపుల్లారావు,జిల్లా నాయకులు జ్యోతుల నెహ్రూ, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, వనమాడి కొండబాబు, ఆకుల రామకృష్ణ, రామచంద్రపురం మండల పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## హైకోర్టు తీర్పు చెంపపెట్టు లాంటిది: సజ్జల

అమరావతి: అన్యాయమైన డిమాండ్‌తో కొందరు పిటిషన్ వేశారని, హైకోర్టు తీర్పు చెంపపెట్టులాంటిందని ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు.సామాజిక అసమతుల్యత అనేవారికి ఈ తీర్పు చెంపదెబ్బ. న్యాయం ఎలా ఉండాలో కోర్టు తీర్పు అలా ఉంది. పేదలకు అమరావతిలో నివసించే అవకాశం లేదనడం దుర్మార్గం. అలాంటి ప్రయత్నం చేయడమే దుస్సాహసం. త్వరలోనే ఇళ్ల స్థలాల పంపిణీ చేస్తాం” అని సజ్జల అన్నారు.”అకాల వర్షాలు పడితే పంట నష్టం జరుగుతుంది. అధికారులు పంట నష్టం అంచనా వేస్తున్నారు. రైతులను ఆదుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం జగన్ ఆదేశాలు ఇచ్చారు. రైతులను ఆదుకునే అన్ని చర్యలు జరుగుతున్నాయి. నాలుగేళ్లుగా సీఎం జగన్ ఎప్పటికప్పుడు నష్టపరిహారం అందించారు. 2014-19 మధ్య నష్టపరిహారం ఎలా ఇచ్చాడో చంద్రబాబు చెప్పాలి. ఓ సీఎం ఎలా పని చెయ్యాలో రోల్ మోడల్ జగన్. అధికార యంత్రాంగానికి ఇబ్బంది కలుగకుండా సీఎం ఇక్కడి నుంచి ఆదేశాలు ఇస్తున్నారు” అని సజ్జల పేర్కొన్నారు.



# సంపాదకీయం

శనివారం 06-05-2023

## పొంచి ఉన్న నీటి ముప్పు

దేశంలో 24,24,540 నీటి వసతులున్నట్టు కేంద్ర జలశక్తి శాఖ వెల్లడించింది. జల వనరుల గణన నివేదిక ప్రాణావసరమైన నీటి లభ్యతలో మనం ఎక్కడ వున్నామో తెలియజేస్తున్నది. ప్రపంచ జనాభాలో 18% మంది వున్న భారత దేశంలో విశ్వవ్యాప్తంగా గల నీటిలో కేవలం 4% మాత్రమే వుంది. నీటి అవసరానికి అందుబాటుకి గల వ్యత్యాసం ఎంత ఆందోళనకరంగా వుందో దీనిని బట్టి వెల్లడవుతున్నది. చెరువులు, రిజర్వాయర్లు, సరస్సులు, సహజ నీటి వసతులు, మానవ నిర్మిత వనరులు ఇలా పలు రకాల జల ఖజానాలను గురించి జలశక్తి శాఖ నివేదిక సవివరమైన సమాచారం అందించింది. ఎక్కడెక్కడ ఏ విధంగా నీరు అందుబాటులో వుందో తెలియజేసింది. మొత్తం నీటి వసతులలో 97.1% గ్రామీణ ప్రాంతాలలో వున్నట్టు, కేవలం 2.9% వసతులు మాత్రమే పట్టణ ప్రాంతాలలో నెలకొన్నట్టు తెలియజేసింది. మొత్తం వనరులలో 55.2% ప్రైవేటు యాజమాన్యంలో మిగతావి మాత్రమే ప్రభుత్వం వద్ద వున్నట్టు వెల్లడించింది. 1.6 % జల వనరులు ఆక్రమణకు గురైనట్టు చెప్పింది. భారత దేశంలో తొలకరి వానలు ఆశ చూపి నిరాశపరుస్తుంటాయని అందుచేత నీటి కోసం దేశ ప్రజలు రానురాను మరింతగా ఇక్కట్లు పడతారని నీతిఆయోగ్ ఒక నివేదికలో పేర్కొన్నది. 60 కోట్ల మంది భారతీయులు సరైన నీటి సదుపాయం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెల్లడించింది. బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్, చెన్నై వంటి 21 నగరాల్లో భూగర్భ జల వనరులు అడుగంటిపోతున్నాయని హెచ్చరించింది. గ్రామీణ ప్రాంతాల్లోనైతే 80 నుంచి 90 శాతం మంచి నీటి అవసరాలకు భూగర్భ జల వనరుల మీదనే ఆధారపడుతున్నాయని తెలియజేసింది. ఇది ముమ్మాటికీ వాస్తవం. దేశంలో నమ్మదగిన నీటి పారుదల సౌకర్యాలు బహు తక్కువగా వున్నాయి. నదులు అనేకం వున్నా వాటి నీటి మీద ఆధారపడగలిగే స్థితి లేదు. అందుచేత వ్యవసాయానికి ఎక్కువగా భూగర్భ నీటినే వినియోగిస్తున్నారు. దేశంలో పడే వర్షపు నీటిలో 65% సముద్రంలో కలిసిపోతున్నది. 70% వ్యవసాయం వర్షాధారమే. సంపన్న వర్గాలకు అందుబాటులో వున్నంత నీరు పేద వర్గాలకు లభించడం లేదు. వేసవిలో ట్యాంకర్ల వద్ద ఎగబాకే జనం నిరుపేదలే. వారు నీరు పేదలు కూడా. 24 లక్షల పైచిలుకు నీటి వసతుల్లో 20 లక్షల 30 వేల వరకు అంటే 83.7 శాతం వనరులు ఉపయోగంలో వుండగా, మిగతా 4 లక్షలు అంటే 16.3 % వనరులే నిరుపయోగంగా వున్నట్టు తేలింది. చెరువులు, బావులు వంటి చాలా జల వనరుల్లో పూడిక తీయకపోడం వల్ల వర్షపు నీరు వృథాగా తరలిపోతున్నది. పట్టణాలు, నగరాల్లో గృహ నిర్మాణం మితిమించిపోయి అక్కడి ఒకప్పటి చెరువులు, దొరువులు అదృశ్యమైపోతున్నాయి. దేశ జనాభాలో 36% నగరాల్లోనే నివసిస్తున్నారు. కాని అక్కడి 70% నీరు కలుషితమైపోతున్నది అని కేంద్ర కాలుష్య నివారణ బోర్డు తెలియజేసింది. ఈశాన్యంలోని అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం, త్రిపుర, మిజోరం, మేఘాలయ, నాగాలాండ్, అసోం రాష్ట్రాల్లో, ఉత్తర భారత రాష్ట్రాలైన పశ్చిమ బెంగాల్, ఒడిశాలలో 50% జల వసతులను చేపల పెంపకానికి వినియోగిస్తుండగా, గుజరాత్, తెలంగాణ, కర్నాటక, జార్ఖండ్ రాష్ట్రాల్లో 50% వనరులను వ్యవసాయానికి, మణిపూర్, హిమాచల్‌ప్రదేశ్‌లలో 50% వసతులను మంచి నీటికి వినియోగిస్తున్నారని జల శక్తి శాఖ జల వసతుల గణన నివేదిక వెల్లడించింది. మొత్తం వసతులలో 78% మనిషి సృష్టించుకున్నవే కావడం గమనార్హం. వర్షాభావ ప్రాంతాలలో నీటిని నిల్వ వుంచుకోడానికి చెక్‌డ్యామ్స్ నిర్మాణం ఇటీవల కాలంలో పెరిగింది. వాటిని కాపాడుకోడంలోనే మనిషి విజ్ఞత ఇమిడి వుంటుంది. ఎన్ని జల వసతులున్నా వాటికి నీరు అందించేది వర్షమే. వానలు సకాలంలో పడకపోడంతో పంటలు దెబ్బతిని ఒకవైపు ఆహార సంక్షోభం, మరోవైపు మంచి నీటి కరవు ఏర్పడుతున్నాయి. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కురిసే తొలకరి వానలు సకాలంలో వస్తాయని ఆశించి రైతులు విత్తనాలు కూడా చల్లుకొని అదే పనిగా ఆకాశం వంక చూడడం, భంగపడడం మనకు మామూలే. ముందు వేసవిలో అకాల వర్షాలు కురిసి వరి, మామిడి వంటి పంటలను నష్టపరచడం రైతులు తడిసిన పంటను చూసి కన్నీళ్ళ పర్యంతం కావడం తరచూ చూస్తున్నాము. వర్షాలు కురవాల్సిన సమయంలో అవి ముఖం చాటేసి పంటలు మాడిపోయే స్థితికి కారణమవుతున్నాయి. అప్పో, సప్పో చేసి, వున్నది, లేనిది తాకట్టు పెట్టి పంటలు వేసుకొన్న రైతు కంట తడి హృదయాలను కలచివేస్తుంటుంది. ప్రకృతి కరుణిస్తేనే మనిషికి సుఖం, లేకపోతే దుఃఖమే. అందుచేత నీటిని పొదుపు చేసుకోడం, పొదుపుగా వాడుకోడం, అదనపు నీటి నిల్వ సౌకర్యాలను పెంచుకోడం అత్యంత అవసరం. వర్షాలు బాగా పడినప్పుడు నదులు నిండి వరదలు కూడా సంభవించి నీరు వృథాగా సముద్రంలోకి కలిసిపోతుంది. వీలైనన్ని రిజర్వాయర్లను నిర్మించుకొని ఆ నీటిని కాపాడుకోగలిగితే అన్ని అవసరాలకీ ఉపయోగపడుతుంది. ముందు చూపుతోనే ముంచుకు వచ్చే విపత్తులను ఎదుర్కోగలుగుతాము.

## వైసీపీలో అంతర్గత పోరు..



విజయవాడ, మే 5, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కీలక నేత, స్వయంగా సీఎం జగన్‌కు సమీప బంధువు అయిన బాలినేని శ్రీనివాసరెడ్డి పార్టీపై అసంతృప్తితో ఉన్నారు. తనకు ఇచ్చిన రీజనల్ కోఆర్డినేటర్ బాధ్యతల నుంచి వైదొలిగారు. స్వయం సీఎం జగన్ పిలిచి మీరే కొనసాగాలి అని చెప్పినా ఆయన కుదరదని చెప్పి వెళ్లిపోయారు. తన నియోజకవర్గానికే పరిమితమవుతానన్నారు. అయితే సీఎం జగన్ తో బంధుత్వం ఉండటం వల్లనే ఆయన అలా ధైర్యంగా చెప్పగలిగారు కానీ ఇలా పార్టీ బాధ్యతల్లో ఉన్న చాలా మంది అసంతృప్తిగా ఉన్నారని చెబుతున్నారు. వీరి అసంతృప్తి ఎందుకు ? సీఎం జగన్ మూడేళ్ల తర్వాత మంత్రి వర్గాన్ని మార్చారు. అందరి దగ్గర రాజీనామాలు తీసుకున్నారు కానీ సగం మందికి మళ్లీ చాన్సిచ్చారు. చాన్సివ్వలేని వారికి పార్టీ పదవులు ఇచ్చారు. ముఖ్యంగా జిల్లా అధ్యక్ష పదవులు, రీజినల్ కోఆర్డినేటర్ పదవులు ఇచ్చారు. పదవి మాత్రమే ఉండదు కానీ.. ప్రోటోకాల్ లోపం రాదని హామీ ఇచ్చారు. అయితే వాస్తవంగా జరుగుతోంది మాత్రం వేరు. రీజనల్ కోఆర్డినేటర్లకు ఎలాంటి ప్రోటోకాల్ లభించకపోగా.. మంత్రి పదవి లేకపోవడంతో జిల్లాలో కూడా ప్రాధాన్యత లేకుండా పోయింది. దీంతో పలువురు మాజీ మంత్రులు తమకు అప్పగించిన బాధ్యతల నుంచి మెల్లగా వైదొలిగారు. ఏడాది క్రితం ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థ ఆశించిన మేర పనిచేయడంలేదన్న భావనతో అధినేత జగన్ అప్పట్లో రీజినల్ కో ఆర్డినేటర్లుగా నియమించిన వారిలో నుండి పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణా రెడ్డి, మాజీ మంత్రులు కొడాలి నాని , అనీల్ కుమార్‌య యాదవ్, మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌లను తప్పించి కొత్త వారికి చాన్సిచ్చారు. మొత్తం 8 మందితో రీజి నల్ కోఆర్డినేటర్ల వ్యవ స్థను ఏర్పాటు చేశారు. ఆ తరువాత కూడా పరిస్థితుల్లో మార్పు రాలేదు. ఎనిమిది మంది రీజినల్ కోఆర్డినేటర్లలో బాలినేని రాజీనామా చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఎం జగన్ బంధువు, టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి మాత్రం యాక్టివ్ గా ఉన్నారు. మిగిలిన వరు ఎవరూ రీజనల్ కోఆర్డినేటర్లుగా చురుకుగా ఉండటం లేదు. తమను కూడా ఆ బాధ్యతల నుంచి తప్పిస్తే బాగుండని అనుకుంటున్నారు. అధికారంలో ఉండే పార్టీలో సహజంగానే వర్గ పోరాటం ఎక్కువగా ఉంటుంది. రీజినల్ కోఆర్డినేటర్లు అందర్నీ సమన్వయం చేసుకుని పార్టీని బలోపేతం చేయాల్సి ఉంటుంది. కానీ వీరెవర మంత్రులు కాకపోవడం.. ఇప్పటికే ఆయా జిల్లాల్లో ఉన్న మంత్రులు తమ పట్టు కోసం సొంత వర్గాన్ని ప్రోత్సహిస్తూండటంతో సమస్యలు వస్తున్నాయి. అదే సమయంలో ఎన్నికలకు కేవలం మరో ఏడాది మాత్రమే ఉన్న కారణంగా తమ సొంత నియోజకవర్గాలనూ చూసుకోవాల్సి వస్తోంది. దీంతో వారికి కేటాయించిన జిల్లాల్లో పూర్తిస్థాయిలో దృష్టిపెట్ట లేని పరిస్థితి ఉందని అంటున్నారు. ఇప్పటికే పార్టీ పరంగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశాలు, స్థానిక సమస్యలు-నిధుల వేట, మరోవైపు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ నిర్వహణ, ని న్నటి వరకూ జగనన్నే మా భవిష్యత్ వంటి వాటినీ సమన్వయం చేసుకోలేపోతున్నారు. ఇన్ని బాధ్యతలు ఎందుకని.. ముందు తాము గెలవడం ముఖ్యమని.. ఆ దిశగా ప్రయత్నిస్తున్నట్లుగా చెబుతున్నారు.

## టీజీ భరత్ కు హ్యాండేనా

కర్నూలు, మే 5, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పొత్తులకు సిద్ధమవుతున్నారు. జనసేనతో ఆయన పొత్తు చర్చల తర్వాత ఖరారవుతుంది. కానీ వామపక్షాలు మాత్రం ఆయన వెంటే నడవనున్నాయి. అది కన్ఫర్మ్. ఎందుకంటే ఇప్పుడు అన్ని రకాలుగా లెఫ్ట్ పార్టీలు తెలుగుదేశం పార్టీకి అండగా ఉంటున్నాయి. జనసేన విషయం పక్కన పెడితే వామపక్షాలు మాత్రం పసుపు జెండాతో కలసి నడిచేందుకు దాదాపు సిద్ధమయ్యారనే చెప్పాలి. పోలింగ్ బూత్‌ల వద్ద ధైర్యంగా అధికార పార్టీ కార్యకర్తలను ఎదుర్కొనాలంటే వామపక్షాల సహకారం కూడా అవసరం. అందుకే వారికి కొన్ని సీట్లను చంద్రబాబు ఖచ్చితంగా ఇచ్చే ఛాన్స్ ఉంది. అయితే ఆ నియోజకవర్గాలేంటి? అన్న దానిపై ప్రస్తుతం టీడీపీలో పెద్దయెత్తున చర్చ జరుగుతుంది. ప్రధానంగా ఒక యువనేతకు మాత్రం గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఎప్పటికైనా శాసనసభలో అడుగుపెట్టాలన్న తన కోరిక నెరవేరాలని కర్నూలు నగరానికి టీజీ భరత్ ఆకాంక్షిస్తున్నారు. తండ్రి బీజేపీలోకి వెళ్లినా టీజీ భరత్ మాత్రం తెలుగుదేశం పార్టీని అంటిపెట్టుకునే ఉన్నారు. పార్టీ కార్యక్రమాల్లో గత నాలుగేళ్లుగా చురుగ్గా పాల్గొంటున్నారు. గత ఎన్నికల్లో టీజీ భరత్ తెలుగుదేశం పార్టీ తరుపున పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. వైసీపీ అభ్యర్థి హాఫీజ్ ఖాన్ పై కేవలం ఐదు వేల ఓట్ల తేడాతోనే ఓటమి చెందారు. తండ్రి టీజీ వెంకటేష్‌కు కూడా భరత్‌ను టీడీపీ నుంచే శాసనసభకు పంపాలని గట్టిగా భావిస్తున్నారు. బీజేపీలో ఉన్నా వెనకుండి ఆయన కుమారుడికి డైరెక్షన్స్ ఇస్తున్నారు. ఆర్థికంగా బలమైన నేత కావడంతో చంద్రబాబు కూడా వారిని కాదని మరెవ్వరికీ సీటు ఇచ్చే అవకాశం లేదు. . అయితే పొత్తు అది లేకుంటే మాత్రమే. వామపక్షాలతో పొత్తు ఉంటే టీజీ భరత్‌కు టిక్కెట్ దక్కడం కష్టమేనంటున్నారు. ఎందుకంటే అక్కడ సీపీఎం నుంచి టిక్కెట్ కోసం పోటీ అధికంగా ఉంటుంది. సీపీఎం నేత, మాజీ ఎమ్మెల్యే ఎం. అబ్దుల్ గఫూర్ సిద్ధంగా ఉన్నారు. ఆయన వైసీపీని వ్యతిరేకించే బలమైన గొంతుకగా మారారు. సీపీఎం కూడా గఫూర్ అభ్యర్థిత్వాన్ని కాదనలేదు. అబ్దుల్ గఫూర్ గతంలో రెండు సార్లు కర్నూలు నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 1994, 2004 లో సీపీఎం అభ్యర్థిగా కర్నూల్ టౌన్ నుంచి విజయం సాధించారు. దీంతో ఈసారి కూడా అబ్దుల్ గఫూర్ టిక్కెట్ కోసం పోటీ పడే అవకాశముంది. ఇటీవలే సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పదవికి పోటీ పడి భంగపడిన గఫూర్‌ను బుజ్జగించేటందుకైనా ఆ పార్టీ గఫూర్ పేరును సిఫార్సు చేస్తుంది. కొద్దో గొప్పో బలముండటం, గతంలో గెలిచిన నేత కావడంతో చంద్రబాబు కూడా కాదనలేని పరిస్థితి. దానికితోడు రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో గత ఎన్నికల్లో కేవలంమూడుఅసెంబ్లీస్థానాలనుమాత్రమేటీడీపీ గెలుచుకోగలిగింది. అందునా కర్నూలు జల్లాలో వైసీపీ క్లీన్ స్వీప్ చేసింది. ఈసారైనా రాయలసీమ జిల్లాల్లో సీట్లు దక్కకపోతే అధికారం కూడా దొరకడం కష్టమే అవుతుంది. కొన్ని కీలకమైన స్థానాల విషయంలో చంద్రబాబు రాజీ పడక తప్పదంటారు. అందులో భాగంగా కర్నూలు సిటీ స్థానాన్ని సీపీఎంకు ఇచ్చినా ఇచ్చేయొచ్చు. అదే జరిగితే టీజీ భరత్ ఆశలు ఈసారి కూడా నెరవేరనట్లే. అయితే వైశ్య సామాజికవర్గం కోటాలో తమకు సీటు ఖచ్చితంగా వస్తుందని టీజీ భరత్ నమ్ముతున్నారు. సిద్ధా రాఘవరావు వైసీపీలోకి వెళ్లిన తర్వాత ఆ స్థాయి వైశ్య నేత టీడీపీలో లేకపోవడం భరత్‌కు సానుకూలించే అంశమని కొందరంటున్నారు. మొత్తం మీద చివరి నిమిషంలో ఏం జరుగుతుందోనన్న టెన్షన్ మాత్రం టీజీ ఫ్యామిలీని వీడటం లేదు.

## విశాఖలో భారీగా మిరియాల పంటలు



విశాఖపట్టణం, మే 5, మిరియాల సాగుకు కేరళ పెట్టింది పేరు. ఇప్పుడు విశాఖ మన్యంలోనూ మిరియాలు సాగవుతున్నాయి. దిగుబడిలోనే కాకుండా నాణ్యతలోనూ మన్యం మిరియం కేరళకు గట్టి పోటీ ఇస్తోంది. కేరళలో పండే మిరియాల కంటే నాణ్యమైన ఆర్గానిక్ మిరియాలను విశాఖ మన్యం అందిస్తోంది. ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడకుండానే.. ఇంకా చెప్పాలంటే పైసా పెట్టుబడి లేకుండానే గిరిజన రైతులు వీటిని పండిస్తున్నారు. ఈ ఏడాది ఒక్క మిరియాల పంట ద్వారానే మన్యం రైతులు రూ.150 కోట్ల వరకూ ఆదాయాన్ని ఆర్జించారంటే విశేషమే మరి. విశాఖ మన్యంలో కాఫీ తోటల్లో అంతర పంటగా మిరియాల సాగు జరుగుతోంది. కాఫీ తోటల ద్వారా కాపును బట్టి ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకూ ఆదాయం వస్తుంటే.. అందులో అంతర పంటగా వేస్తున్న మిరియాలతో రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకూ అదనపు ఆదాయం సమకూరుతోంది. మిరియాల సాగుకు సూర్యరశ్మితో పాటు తగిన నీడ కూడా ఉండాలి. నీరు నిలవని ఏటవాలు భూమి అవసరం. పాదులు 20 నుంచి 30 అడుగుల ఎత్తుకు పెరుగుతాయి కాబట్టి వాటికి ఆసరాగా ఎత్తయిన చెట్లు ఉండాలి. విశాఖ మన్యంలోని కొండవాలు ప్రాంతాలు సాగుకు అనుకూలంగా ఉండటంతో ప్రస్తుతం 98 వేల ఎకరాల కాఫీ తోటల్లో రైతులు అంతర పంటగా మిరియాల పాదులు వేశారు. ఒకసారి మొక్క వేస్తే రెండో ఏట నుంచే కాపు మొదలవుతుంది. 20 సంవత్సరాల పాటు జనవరి నుంచి ఏప్రిల్?మే నెల వరకూ ఫలసాయం వస్తుంది. ఈ ప్రాంతంలో కాఫీ మొక్కలకు నీడ కోసం పొడవుగా ఎదిగే సిల్వర్ ఓక్ చెట్లను పెంచుతున్నారు. ఆ చెట్ల మొదలులో మిరియం మొక్కలు నాటుతున్నారు. పాడేరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ద్వారా గిరిజన రైతులను మిరియాల సాగు వైపు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ప్రస్తుతం కరియా ముండ, పన్నియూరు?1 అనే రకాల మిరియాలు సాగవుతున్నాయి. వాటికన్నా అధిక దిగుబడి, నాణ్యమైన ఉత్పత్తిని ఇచ్చే మేలు రకాల మొక్కల (మదర్ ప్లాంట్ల)ను కోజికోడ్‌లోని భారత సుగంధ ద్రవ్యాల పరిశోధన సంస్థ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పైసెస్ రీసెర్చ్?ఐఐఎస్ఆర్) నుంచి తీసుకొచ్చి చింతపల్లిలో నర్సరీల్లో అభివృద్ధి చేస్తున్నారు. వీటిలో శక్తి, మలబార్ ఎక్సెల్, పౌర్ణమి, గిరిముండ, పంచమి, శుభకర, శ్రీకర రకాల మొక్కలు ఉన్నాయి. వాతావరణం అనుకూలించడంతో ఈ సంవత్సరం రికార్డు స్థాయిలో దాదాపు 4 వేల మెట్రిక్ టన్నుల మిరియాల దిగుబడి వచి?చంది. 3.2 కిలోల పచ్చి మిరియాలను ఎండబెడితే ఒక కిలో ఎండు మిరియాలు వస్తాయి. వాటి ధర కిలో రూ.360 నుంచి రూ.400 వరకూ ఉంది. ఈ లెక్కన గిరిజన రైతులకు దాదాపు రూ.150 కోట్ల వరకూ అదనపు ఆదాయం మిరియాలతో సమకూరింది.

## చిక్కుల్లో రాపాక...



కాకినాడ, మే 5, జనసేన తరఫున గెలిచి వైసీపీ అనుబంధంగా పనిచేస్తున్న ఏకైక ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ పై అనర్హతా ముప్పు పొంచి ఉంది. తాను దొంగ ఓట్లతో గెలిచానని బహిరంగంగా ప్రకటించుకున్న వీడియో వైరల్ అయింది. ఈ వీడియోపై సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కలెక్టర్ ను ఆదేశించారు. రాపాక వరప్రసాద్‌పై రాజోలుకు చెందిన ఎనుముల వెంకటపతిరాజు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అంతర్వేది దేవస్థానం గ్రామంలో ఈ ఏడాది మార్చి 24న రాపాక ఎన్నికల అక్రమాలను అంగీకరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను ఎన్నికల్లో గెలిచేందుకు భారీగా దొంగ ఓట్లు వేశారని పేర్కొన్న ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి . ఆ వీడియో ఆధారం తన వద్దకు వచ్చినందున ఈ ఫిర్యాదుపై సమగ్ర రిపోర్టు ఇవ్వాలని డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్‌కు ఎన్నికల కమిషనర్ ఆదేశించారు. వారం రోజుల్లోగా దీనిపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌కు రాసిన లేఖలో ఉంది. అయితే.. ఇప్పుడీ వ్యవహారంలో రాపాక ఏం చేయబోతున్నారనే దానిపై ఆయన అభిమానులు, అనుచరుల్లో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఏపీలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాపాకను టీడీపీ ఉండి ఎమ్మెల్యే రామరాజు కొనబోయారని ఎమ్మెల్యేనే చెప్పడంతో పెద్ద రచ్చే జరిగింది. సరిగ్గా ఇదే టైమ్‌లోనే రాపాక నోటి నుంచి దొంగ ఓట్ల వ్యవహారం బయటికొచ్చింది. దీంతో ఈ రెండూ ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ అయ్యాయి. తాను గెలవడానికి దొంగ ఓట్లే కారణంమని ఒప్పుకున్నారు. వరప్రసాద్‌కు తన సొంత గ్రామం చింతలమోరిలో అభిమానుల ఆత్మీయ సమావేశంలో రాపాక గుట్టు విప్పారు. అభిమానులు, స్నేహితులను చూసిన రాపాక... తన మనసులోని మాటను బయటపెట్టారు. 'చింతలమోరిలో మా ఇంటి దగ్గర బూత్‌లో కాపుల ఓట్లు ఉండవు. అన్నీ ఎస్సీల ఓట్లే ఉంటాయి. ఎవరో ఎవరికీ తెలిదు. సుభాష్‌తో పాటు వీళ్లంతా జట్టుగా వచ్చి ఒక్కక్కరు దొంగ ఓట్లు వేసి వెళ్లిపోయేవాళ్లు. పదిహేను, ఇరవై మంది వచ్చేవాళ్లు, ఒక్కొక్కరు పదేసి ఓట్లు వేసేవాళ్లు. ఏకంగా ఈ ఓట్ల వల్ల 800 ఓట్ల వందల మెజార్టీ వచ్చింది' అని రాపాక తన గెలుపు రహస్యాన్ని బట్టబయలు చేశారు. ఇప్పుడు జిల్లా కలెక్టర్ అసలేం జరిగింది..? రాపాక మాటల్లో నిజమెంత..? ఇలా అన్ని విషయాలను నిశితంగా పరిశీలించి ఎన్నికల కమిషన్‌కు నివేదిక అందజేయాల్సి ఉంది. ఈ నివేదికను బట్టి రాపాకపై ఈసీ చర్యలు తీసుకునే ఛాన్స్ ఉంది. నివేదిక ఎలా ఉంటుందో..? అన్నదానిపై తదుపరి చర్యలు ఉండొచ్చు.

## కోటప్ప కొండ ఈవో అత్యుత్సాహం

గుంటూరు, మే 5, పల్నాడు జిల్లా నరసరావుపేట మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయ ఈవో వేమూరి గోపిపై ఆలయ పూజారులు, సిబ్బంది తిరుగుబాటు బావుటా ఎగరేశారు. స్వామివారికి సమర్పించ వలసిన నిత్య కైంకర్యాలకు సహకరించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. భక్తుల ఎదుటే పూజారులను, సిబ్బందిని గౌరవం లేకుండా తీవ్రమైన పరుష పదజాలంతో దుర్భాషలా డుతున్నారని,తమ మనోభావాలు దెబ్బతినేల కించపరుస్తున్నారని,ఓ లేఖపై రాసి ఇూ గోపీకి అందచేసి వెళ్లిపోయారు.మే 4వ తేదీ నుంచి పూర్తిగా కొండ పైనా క్రింద స్వామివారికి నిత్య కైంకర్యాలు, విధులను బహిష్కరిస్తున్నట్లు వారు తెలిపారు. అదే విధంగా స్వామి వారి కైంకర్యాలకు స్వామివారి ఆభరణాలకు, భక్తులు అందించే కానుకులకు భద్రత లేకుండా పోవడంతో తమ మనసులో అశాంతి నెలకొని అభద్రత భావంతో ఉన్నామని పూజారులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఆగమ సాంప్రదాయానికి విరుద్ధంగా తమ చేత స్వామి కార్యక్రమాల విషయంలో భయపెట్టి బెదిరించి కార్యక్రమాలు నిర్వహించేలా చేస్తున్నారని ఆరోపించారు. ఈ తిరుగుబాటులో ఆలయ ప్రధాన అర్చకులు కొండ కావూరి అప్పయ్య గురుకుల్, పూజారులు రంగవద్యుల కిరణ్ కిషోర్ శర్మ, ఫణింద్ర దుర్గ, రామకృష్ణ వేద వ్యాస్, కే సత్యం, కెవి సుబ్రహ్మణ్యం, అలానే ఆలయ సిబ్బంది కొండయ్య, నాగిరెడ్డి, శ్రీనివాసరావు తదితరులు విధులు బహిష్కరిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. అర్చకుల ఆరోపణలను ఆలయ ఇఒ వేమూరి గోపి ఖండించారు. అర్చకులతో తాను అనుచితంగా ప్రవర్తించలేదని, దుర్భాషలాడలేదని తెలిపారు. నిబంధనల మేరకు పని చేయాలని మాత్రమే ఆదేశించానని చెప్పారు. ఈ సమస్యను సామరస్యంగా పరిష్కరించుకునేందుకు డిప్యూటీ ఇఒ చంద్రశేఖర్‌రెడ్డి చర్చిస్తున్నారని, యాత్రికుల మనోభావాలు దెబ్బతినకుండా ఆలయ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఓ వైపు ఈవో మరో వైపు అర్చకులు పట్టిన పట్టు విడువకపోవడంతో కోటప్పకొండలో కైంకర్యాలు నిలిచిపోయినట్లుగా తెలుస్తోంది. దీనిపై భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నర్సరావుపేటలో కోటప్పకొండపై ఉన్న త్రికోటేశ్వరస్వామి వారి ఆలయం అత్యంత మహిమాన్వితమైనదిగా గుర్తింపు పొందింది. పెద్ద సంఖ్యలో భక్తులు ప్రతీ రోజూ వస్తూంటారు. అయితే ఈవోకు.. అర్చకులకు ఈ మధ్య కాలంలో ఏర్పడిన వివాదాలతో సమస్యలు ప్రారంభమయ్యాయి. ఎవరూ తగ్గకపోవడంతో పూజాధికాలకూ సమస్యలు ఏర్పడ్డాయి.

## పనస కాయలకు మంచి డిమాండ్

శ్రీకాకుళం, మే 5, ఉద్దానం పంటను ఉత్తరాది వాళ్లూ మెచ్చారు. ఇక్కడి పనసకు కాయలను ఆ రాష్ట్రాల వారు లొట్టలేసుకుని తింటున్నారు. దీంతో ఇక్కడి పనస డిమాండ్ పెరుగుతోంది. రుచి పరంగా అద్భుతంగా ఉండడంతో పాటు రంజాన్ సీజన్ కావడంతో ఉత్తరప్రదేశ్, బిహార్, తదితర రాష్ట్రాలు ఉద్దానం ప్రాంతం నుంచి పనస కాయలు, పండ్లను దిగమతి చేసుకుంటున్నాయి.మరోవైపు కాశీబుగ్గ కేంద్రంగా బరంపురం, గుజరాత్, కోల్‌కతా, కటక్ తదితర ప్రాంతాలకు కూడా పనస ఎగుమతి అవుతోంది. శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ, పూండి, హరిపురం, కవిటి, ఇచ్ఛాపురం, మందస, కంచిలి, సోంపేట కేంద్రాల నుంచి వివిధ రాష్ట్రాలకు పనస ఎగుమతులు ఊపందుకున్నాయి.

గడచిన రెండు నెలల్లో రోజుకు సగటున 44 టన్నుల చొప్పున ఇప్పటివరకు 2,640 టన్నుల పనస కాయలు ఎగుమతి అయ్యాయి.మార్చి నెలాఖరు నుంచి మే వరకు పనస ఎగుమతులు కొనసాగుతాయి. తిత్లీ తుపానుకు దెబ్బతిన్న పనస చెట్లన్నీ ఈ ఏడాది జీవం పోసుకుని విరగకాస్తున్నాయి. ఉద్దాన ప్రాంతంలోని ఏడు మండలాల్లో పనస అంతర పంటగా సాగవుతోంది. ఇబ్బడిముబ్బడిగా దిగుబడులు రావడంతో ప్రస్తుతం కేజీ పనస కాయ కేవలం రూ.13 చొప్పున మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఈ ధర గతంలో కేజీ రూ.20 వరకు ఉండేది. ఉద్యాన శాఖాధికారులు పనస, మునగ తదితర పంటలకూ ప్రభుత్వ పరంగా ధరలు నిర్ణయిస్తే మేలు జరుగుతుందని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.ముక్కల బిర్యానీ, పనస పొట్టు కూర, పనస పండు హల్వా, పనస పొట్టు పకోడి, పనస గింజల కూర, పనస ముక్కల గూనచారు, పనస చిల్లీ, పనస కాయ కుర్మా, పనసకాయ ఇడ్లీ, పొంగనాలు, పనస నిల్వ పచ్చడి, పనస బూరెలు.

# ఏటీ అగ్రహారం... పాయో... ఫాతిమానగర్ వచ్చే

గుంటూరు, మే 5, గుంటూరులో ఏటీ ఆగ్రహారం పేరును ఫాతిమాపురంగా మార్చిన వ్యవహారం వివాదాస్పదమవుతోంది. వంద సంవత్సరాల చరిత్ర కలిగి...అగ్రహారం గా ఉన్న ప్రాంతాన్ని ఏ విధంగా పేరు మారుస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గుంటూరుతో పరిచయం ఉన్న ప్రతి ఒక్కరికీ ఏ.టీ. అగ్రహారం సుపరిచితమే...ఏ.టీ. అగ్రహారం మూలాలు గుంటూరు నగరంతో అంతగా ముడి పడి ఉన్నాయి..వంద సంవత్సరాల చరిత్ర ఉన్న ప్రాంతం ఆనంద త్రిదండి అగ్రహారం కాల క్రమేణ ఏ.టీ. అగ్రహారంగా మారింది. గుంటూరు పట్టణం అంతగా విస్తరించని రోజులలో పట్టణానికి దూరంగా ఏ.టీ. అగ్రహారం రూపు దిద్దుకుంది. గుంటూరు నగరం వేగంగంగా అభివృద్ధి చెందటంతో.. ఏటీ అగ్రహారం పట్టణ నడిబోడ్డుగా మారింది..మొత్తం 21 లైన్లతో శరవేగంగా అభివృద్ధి చెందింది.ఈ ప్రాంతంలో 95 శాతం హింధువులు 5 శాతం తతిమా వర్గాల వారు ఉంటారు..హిధువులలలో వివిధ కులాల వారు ఉన్నపట్టికి ఏ.టీ. అగ్రహారం వాసులమని చెప్పుకొవడం ఈ ప్రాంత వాసులు గౌరవంగా భావిస్తారు. ఈ ప్రాంతాన్ని అభిమానిస్తారు, ప్రేమిస్తారు...కానీ ఈ ప్రాంత వాసులు ఒక్క సారిగా మునిసిపల్ కార్పోరేషన్ తీరుపై, అధికార పార్టీ నాయకుల వ్యవహారంపై మండి పడుతున్నారు. ఏ.టీ. అగ్రహారం పేరు మార్పును వ్యతిరేకిస్తూ అగ్గి మీద గుగ్గిలం అవుతున్నారు. ఏ.టీ అగ్రహారంగా సుపరిచితమైన ప్రాంతానికి పేరు ఎందుకు మార్చవలసి వచ్చిందని ప్రశ్నిస్తున్నారు. ఏటీ అగ్రహారం పేరు మార్పును బీజేపీ తీవ్ర స్థాయిలో కండించింది. ఓ మతం వారికి ప్రజాధనంతో జీతాలిస్తారుని.. ఎంపీ ల్యాడ్స్‌తో ఓ మత ప్రార్ధనలకు నిర్మాణాలు చేస్తారని .. ఇప్పుడు కాలనీలకు పేర్లు మార్చేస్తున్నారని బీజేపీ ఏపీ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి మండిపడ్డారు. ప్రత్యేకంగా జీవోలిచ్చి మరీ కొన్ని మతాల కోసం నిధులు మంజూరు చేస్తున్నారని.. మత మార్పిళ్లకు కావాల్సినంత స్వేచ్ఛ ఇస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పుడు కాలనీలకు కాలనీలనే మతం మార్చేస్తున్నాని మండిపడ్డారు. రాత్రికి రాత్రే గుంటూరులో ఏటీ అగ్రహారాన్ని ఫాతిమాపురంగా ఎలా మారిందని విష్ణువర్ధన్ రెడ్డి , సోము వీర్రాజు ప్రశ్నించారు. ప్రజాగ్రహంతో కార్పొరేషన్ అధికారుల దిద్దుబాటు చర్యలకు సన్నద్ధమయ్యారు. .నగరపాలక సంస్థ కమిషనర్ చెరుకూరి కీర్తి ప్రస్ నోట్ రిలీజ్ చేశారు. .స్వచ్ఛ సర్వేక్షణ్ లో బాగంగా నోటిఫైడ్ ప్రాంతాలలో నేమ్ బోర్డులను ఏర్పటు చేశామని తెలిపారు. పక్క ప్రాంతంలో ఏర్పాటు చేయవలసిన బోర్డు పొరపాటున ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసారని తెలిపారు. కుల, మతాలు రెచ్చగొట్టే విధంగా తాము ప్రవర్తించమని వివరించారు.. సంఘటనపై విచారణ జరిపి పూర్తి నివేదిక అందించాలని కోరామన్నారు..నివేదిక ప్రకారం చర్యలుంటాయన్నారు..ప్రజల మనోభావాలకు భిన్నాంగా కార్పోరేషన్ చర్యలు తీసుకోదని స్పష్టం చేశారు..తక్షణమే వివాదానికి కారణమైన నేమ్ బోర్డును తొలగిస్తామన్నారఒక పథకం ప్రకారమే పేరు మార్పునకు శ్రీకారం చుట్టారని స్థానికులు అంటున్నారు. .నెల రోజుల క్రితమే బోర్డు తొలగించ మని రిప్రజెంటేషన్ ఇచ్చినా పట్టించుకొని అధికారులు ఇప్పుడు ఎందుకు హడావిడి చేస్తున్నారో అర్థమైదని చెబుతున్నారు. .జీరో లైన్ లో ఏర్పాటు చేయవలసిన బోర్డ్ రెండవ లైన్ లో ఏర్పాటు చేయడంలోనే ఆతర్యం ఉందని...కొంత కాలం ఫతిమా నగర్ బోర్డు అక్కడ ఉంచి తర్వాత సర్వే చేయించి ఆతర్వాత నోటిఫైడ్ చేయిస్తే రికార్డు లలో పేరు మర్పు జరుగుతుంది. ఆ ప్లాన్ తోనే మొత్తం స్కెచ్ వేశారని స్థానికులలో తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆ తీవ్రతను తగ్గించేందుకు ప్రయత్నిస్తునారని తెలియ చేస్తున్నారు.

# ఒంగోలు నుంచి కొత్త ముఖం

ఒంగోలు, మే5,పార్లమెంటు ఎన్నికలు, శాసనసభ ఎన్నికలు ఏపీలో ఒకే సారి జరుగుతాయి. అందుకే అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలపై చర్చ జరగడం మామూలే. అధికార వైసీపీలో ఈ చర్చ కొంత ఎక్కువగా కనపడుతుంది. వినపడుతుంది. ప్రచారం కూడా ఎప్పుడూ ఎక్కువగానే జరుగుతుంటుంది. ఇప్పుడు నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి ఎవరు అన్న దానిపై పార్టీలో జోరుగా చర్చ జరుగుతుంది. ప్రస్తుతం నెల్లూరు పార్లమెంటు సభ్యుడిగా ఆదాల ప్రభాకర్ రెడ్డి ఉన్నారు. ఇటీవల ఆయనను నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పార్టీ అధినేత నియమించారు.నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పార్టీ హైకమాండ్‌పై చేసిన వ్యాఖ్యలతో ఆదాలను హడావిడిగా తెచ్చి రూరల్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. నెల్లూరు జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడంతో కొంత వైసీపీకి రాబోయే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి ఎవరన్న చర్చ జరుగుతుంది. వచ్చే ఎన్నికల్లోనూ రూరల్ నియోజకవర్గం నుంచి ఆదాల ప్రభాకర్ రెడ్డి పోటీ చేస్తారని అధికారికంగానే ప్రకటించారు. నెల్లూరు రూరల్ నుంచి పోటీ చేస్తావన్న జగన్ ఇచ్చిన హామీతోనే ఆదాల ప్రభాకర్ రెడ్డి కూడా అంగీకరించారని చెబుతారు. అంటే వచ్చే ఎన్నికల్లో మరో అభ్యర్థిని పార్లమెంటు నియోజకవర్గంలో పోటీ చేయించాల్సి ఉంటుంది. మరి ఆ అభ్యర్థి ఎవరా? అన్న దానిపై జోరుగా చర్చ జరుగుతుంది. కొందరు నేతలు ఇప్పటి నుంచే ప్రయత్నాలు కూడా మొదలు పెట్టారట.నెల్లూరు పార్లమెంటు నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన బీద మస్తాన్‌రావుకు కూడా రాజ్యసభ పదవి దక్కింది. దీంతో ఆయనను అభ్యర్థిగా ఎంపిక చేసే అవకాశంలేదు. నెల్లూరు పార్లమెంటుకు రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారినే అభ్యర్థిగా ఎంపిక చేయాల్సి ఉంటుంది. అక్కడ మరో సామాజికవర్గానికి ఇచ్చి ప్రయోగం చేసే వీలుండదు. అయితే మాగుంట శ్రీనివాసరెడ్డిని ఒంగోలు పార్లమెంటు నుంచి నెల్లూరుకు షిఫ్ట్ చేస్తారన్న ప్రచారం కూడా జరుగుతుంది. మాగుంట కుటుంబానికి సొంత ప్రాంతమైన నెల్లూరు జిల్లాలోనూ పట్టుండటంతో వారికి ఛాన్స్ ఇచ్చే అవకాశాలున్నాయంటున్నారు. అదే సమయంలో ఒంగోలు పార్లమెంటుకు వైవీ సుబ్బారెడ్డిని పోటీ చేయించాలన్న లెక్కలు కూడా వినపడుతున్నాయి. వైవీ సుబ్బారెడ్డికి గత ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వలేదు. అధికారంలోకి రాగానే ఆయనను టీటీడీ ఛైర్మన్ గా జగన్ చేశారు. సొంత బాబాయి కావడంతో మరోసారి టీటీడీ ఛైర్మన్ పదవిని జగన్ రెన్యువల్ చేశారు. దీంతో ఈసారి వైవీని ఒంగోలు నుంచి పోటీ చేయించి మాగుంట కుటుంబాన్ని నెల్లూరుకు పంపాలన్న యోచనలో అధినాయకత్వం ఉందని తెలిసింది. అయితే మాగుంట శ్రీనివాసరెడ్డి మాత్రం తన కుమారుడు రాఘవరెడ్డిని ఈసారి ఒంగోలు పార్లమెంటు నుంచి పోటీ చేయించాలని భావించారు. కానీ ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో రాఘవరెడ్డి ఇరుక్కోవడంతో ఆయన మనసు మార్చుకున్నారని చెబుతున్నారు. నెల్లూరులో పోటీకి మాగుంట విముఖత చూపితే మేకపాటి రాజమోహన్ రెడ్డికి టిక్కెట్ ఇచ్చే అవకాశమూ లేకపోలేదంటున్నారు. అయితే వయసు రీత్యా మేకపాటి పోటీకి సుముఖత చూపకపోతే మాత్రం మాగుంటను నెల్లూరుకు షిఫ్ట్ చేయడం ఖాయమని చెబుతున్నారు.

# ఇండియాలో 75 కోట్ల మంది ఇంటర్నెట్ వినియోగదారులు

న్యూఢిల్లీ, మే 5, (న్యూస్ పల్స్)మొబైల్ ఫోన్ వచ్చాక ప్రజల జీవనశైలి పూర్తిగా మారిపోయింది. ఎక్కడ చూసిన ఫోన్ లేకుండా ఎవరూ ఉండటం లేదు. ముఖ్యంగా ఇంటర్నెట్ వాడకం వీపరీతంగా పెరిగిపోయింది. ఒక్కరోజు కూడా ఇంటర్నెట్ వాడకుండా ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయి. అయితే మనదేశంలో దాదాపు 75 కోట్ల మంది యాక్టివ్ ఇంటర్నెట్ వినియోగదారులు వాడుతున్నారని.. వీళ్ల కనీసం నెలకోసారైన ఇంటర్నేట్‌ను వినియోగిస్తున్నట్లు ఓ నివేదిక వెల్లడించింది. అయితే 2025 నాటికి ఇంటర్నెట్ వాడే వినియోగదారుల సంఖ్య 90 కోట్లకు చేరుకుంటుందని పేర్కొంది. అలగే ఆ ఏడాదికి ఇంటర్నెట్ యూజర్లు 56 శాతం గ్రామీణ ప్రాంతాలకే చెందినవారు ఉంటారని తెలిపింది. ఈ నివేదిక ప్రకారం 2022లో ఇంటర్నేట్ వాడేవారిలో 39 కోట్లకు పైగా గ్రామీణ ప్రాంతానికి చెందినవారు కాగా.. 36 కోట్ల మంది పట్టణ ప్రాంతానికి చెందినట్లు పేర్కొంది. మరో విషయం ఏంటంటే ఇంటర్నేట్ వినియోగించేవారిలో 54 శాతం పురుషులు ఉండడం కొనసాగుతుండగా.. 2022లో మాత్రం 57 శాతం మహిళలే ఉన్నట్లు తేలింది. 2025 నాటికి 65 శాతం మంది మహిళలే ఇంటర్నెట్‌ను ఎక్కువగా వినియోగిస్తారని పేర్కొంది.

# కన్నుల పండుగగా చిన వెంకన్న కళ్యాణ మహోత్సవం

ఏలూరు ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల చిన వెంకన్న కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. శ్రీదేవి భూదేవి సమేతుడైన ఆ శ్రీనివాసునీ కళ్యాణాన్ని తిలకించిన భక్తులు ఆనంద పారవశ్యంలో మునిగితేలారు. స్వామివారి వివాహ మహోత్సవానికి ఆలయ తూర్పు రాజగోపురం ముందర అనివేటి మండపంలో ప్రత్యేక కల్యాణ మండపాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా స్వామి, అమ్మవార్లను వేర్వేరు వాహనాల్లో కళ్యాణ మండపానికి తీసుకువెళ్లారు. అక్కడ అర్చకులు స్వామి, అమ్మవార్ల కళ్యాణమూర్తులను ప్రత్యేక పూలతో అలంకరింఛారు. స్వామి అమ్మవార్లకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పట్టు వస్త్రాలు సమర్పించారు. శుభ ముహూర్త సమయాన మంగళ వాయిద్యాలు మేళ తాళాలు నడుమ వేదమంత్రాల సాక్షిగా అర్చకులు జీలకర్ర బెల్లం పూర్తి చేశారు. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవనీ అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఎస్ వి సుధాకర్ రావు, ఈవో వేంద్ర త్రినాధరావు, పాలకమండల సభ్యులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కళ్యాణం అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను, తలంబ్రాలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ.. స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని, రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే స్వామివారి ఆశీస్సులు కావాలని, అన్ని ప్రధాన ఆలయాల్లో భక్తులకు ఏటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ధార్మిక కార్యక్రమాల ఏర్పాటుకు ప్రతి ఆలయంలో కొంత నిధిని ఏర్పాటు చేశామని, ఈనెల 12 నుంచి 15 వరకు విజయవాడలో అష్టోత్తర శత కుండాత్మక చండీ రుద్ర రాజశ్యామల సుదర్శన సహిత శ్రీ లక్ష్మి మహా యజ్ఞాన్ని నిర్వహిస్తున్నామని, లక్షలాదిమంది భక్తులు యజ్ఞంలో పాల్గొనే విధంగా ఏర్పాటు చేస్తున్నామని, యజ్ఞ ఫలాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అందించనున్నామని, రాష్ట్ర ప్రజల సుఖ సంతోషాల కోసం ఈ యజ్ఞాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

# అక్టోబరు నాటికి ఫిషింగ్ హార్బర్

విజయవాడ, మే 5, మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. సముద్రపు మొగ నుండి 3 కిలోమీటర్ల ప్రధాన కాలువ మార్గంలో 22 లక్షల క్యూబిక్ మీటర్ల పూడిక తొలగింపు చేపట్టారు. రూ.348 కోట్లతో ఫిషింగ్ హార్బర్ వద్ద జరుగుతున్న పనులను మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్, డిప్యూటీ మేయర్ పలువురు కార్పొరేటర్లతో కలిసి పరిశీలించారు. హ మచిలీపట్నం గిలకలదిండిలో సముద్రపు మొగ నుండి 3 కిలోమీటర్ల ప్రధాన కాలువ మార్గంలో 22 లక్షల క్యూబిక్ మీటర్ల పూడికను డ్రెడ్జర్ల సహాయంతో 70 శాతం తవ్వకం పనులు దాదాపుగా పూర్తయ్యాయి. వేసవి కాలం అయినప్పటికి వర్షాలు కారణంగా కొంత మేర పనుల కు ఆటంకం ఏర్పడిందిన,వర్షాలు తగ్గగానే పనులను వేగవంతం చేసేందుకు అవసరం అయినచర్యలు తీసుకోవటం తో పాటుగా,నిర్మాణ పనులను సాంకేతికంగా పూర్తి చేయనున్నట్లు అధికారులు వారికి వివరించారు. మచిలీపట్నం లో సముద్రంలో చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారుల చిరకాల స్వప్నం మరికొద్ది నెలల్లో అందుబాటులోకి రానుందని వైసీపీ నేతలు ప్రకటించారు. 2009 సంవత్సరం నుండి సముద్రము మొగలో పూడిక తీయించాలని డిమాండ్ ఈ ప్రాంతంలో ఉందన్నారు. కేవలం సముద్రపు పోటు సమయంలోనే చేపల వేటకు వెళ్లే పడవలు తీరానికి వస్తున్నాయని, మొగలో పూడిక సమస్య తీవ్రంగా ఉండడంతో పడవలు సముద్రంలోనికి వెళ్లలేకపోతున్నాయని ఆ సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. మచిలీపట్నం లోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10 చోట్ల ఆధునిక వసతులతో కూడిన ఫిషింగ్ హార్బర్ ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి, జట్టీల నిర్మాణానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగంగా మత్స్యకారులకు రూ. 348 కోట్లతో మెరుగైన సౌకర్యాలు ఏర్పాటుకు రూపకల్పన జరిగింది. మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ పరిధిలో 28 ఎకరాలలో 23 భవనాలు నిర్మితమవుతున్నాయి. అందులో ఆక్షన్ హాల్, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, గేర్ కటింగ్, రెస్ట్ హౌస్, పోలీస్ స్టేషన్, పెట్రోల్ బంక్, రోజుకి 3 వేల ఐస్ బ్లాకులను తయారు చేసే ఐస్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్, క్యాంటీన్, తదితర భవనాలు ఈ ప్రాంగణంలో నిర్మిస్తారు. ఇప్పుడు జరుగుతున్న డ్రెడ్జింగ్ పనులు 3.5 మీటర్ల లోతున, 10.50 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి త్రవ్వడం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

దీని వలన రాబోయే 50 ఏళ్ల దాకా మత్స్యకారులకు సముద్రపు మొగలో ఎటువంటి ఇసుక మేట అడ్డంకి లేకుండా చేపలవేటకు సురక్షితంగా వెళ్లేందుకు వీలు పడుతుందని వివరించారు. సముద్ర మొగకు దక్షిణం వైపు గల కృష్ణా నది సిల్ట్ కారణంగా మొగ పూడికకు కారణం అవుతుందని, దీని నివారణకు దక్షిణం వైపు 1240 మీటర్లు, ఉత్తరం వైపు 1150 మీటర్ల పొడవైన గోడ నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. మత్స్యకారులు ఫిషింగ్ చేశాక దిగుమతి కోసం ఒకేసారి 600 బోట్లు నిలబెట్టేందుకు వీలుగా పార్కింగ్ ను 790 మీటర్ల 'కే' వాల్ కూడా నిర్మించడం ఇక్కడ ఫిషింగ్ హార్బర్ స్పెషాలిటిగా చెప్పవచ్చు..మత్స్య సంపద ఎగుమతి దిగుమతుల కోసం మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడం, పనులన్నీ శరవేగంగా జరుగుతున్నాయని అదికారులు తెలిపారు.

# పోలవరం ఎప్పటికి పూర్తయ్యేనో ?


## పూర్తి చేసే బాధ్యత కేంద్రానిదే

## కేందరంపై ఒత్తిడి పెంచడంతోనే లాభం

అమరావతి,మే5): జాతీయ ప్రాజెక్ట్ పోలవరం విషయంలో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు తప్పిదాల వల్ల ప్రాజెక్ట్ ఆలస్యం కావడం, డయాఫ్రామ్ వాల్ కూలిపోవడం వంటి నిర్లక్ష్యం సరికాదు. మంత్రి అంబటి రాంబాబు అక్కడ పర్యటించి పోలవరం పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.అయితే పోలవరంపై వైసిపి,టిడిపిలు పరస్పర విమర్శలు తప్ప అసలు పనులు ఎంతమేరకు వచ్చాయన్న దానిలో స్పష్టత ఇవ్వడం లేదు. పోలవరం జాతీయ ప్రాజెక్ట్. దీనిని పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్రానిది. అలాగే సకాలంలో నిధులు విడుదల చేసి పూర్తి చయాల్సి ఉంది. అయితే దీనిలో ఏవైనా అవకతవకలు లేదా నిధుల దుర్వినియోగం ఉంటే ఎపి ప్రభుత్వాన్ని నిలదీయవచ్చు. నిధుల దుబారాను అరికట్టవచ్చు. కానీ పోలవరంపై నేటికీ స్పష్టమైన విధానం లేకుండా సాగుతోంది. చంద్రబాబు హయాంలో పోలవరం నిర్మాణాలను పరిశీలించిన దాదాపు 70శాతం నిర్మాణాలు పూర్తి కావచ్చాయని ప్రకటించారు. కానీ జగన్ అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా ఇంకా పనులు కొనసాగుతున్నాయి.కేంద్రం కూడా పర్యవేక్షణ చేయడం లేదు. సోమవారంను పోలవారంగా భావించి సీఎం చంద్రబాబు ప్రాజెక్టు పనులు పూర్తికి శ్రీకారం చుట్టామ న్నారు. కాంట్రాక్టు ఏజెన్సీలకు లక్ష్యాలను నిర్ణయించి పరుగులు పెట్టించామని అన్నారు. గ్రావిటీ ద్వారా నీరందించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ మేరకు రైతులకు హామీ ఇచ్చారు. మాట నిలబెట్టు కోవడానికి సర్వశక్తులు ఒడ్డుతున్నట్లు చెప్పారు. రాజకీయ ప్రత్యర్థులను, వారికి సహకరించే సంస్థలను ముప్పుతిప్పలు పెట్టడానికై ఆదాయపు పన్ను శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్లను విచ్చలవిడిగా వినియోగించడాన్ని చూస్తున్నాం. పోలవరం విషయంలో కూడా నిజాలు నిగ్గుతేల్చాలి. అలాగే పెరిగిన వ్యయానికి అనుగుణంగా నిధులు విడుదల చేయాల్సి ఉంది. ఉమమడిగా అఖిలపక్షంగా వెళ్లి కేంద్రాన్ని నిలదీయాలి. పదేళ్లు కావస్తున్నా ప్రాజెక్ట్ పూర్తి కాకపోవడం దారుణం కాక మరోటి కాదు

# బాలినేని నా మజాకా!

అమరావతి మే 5 అధికారుల బదిలీల్లో అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు ఏ స్థాయిలో ఉంటుందనేందుకు ఒంగోలు డీఎస్పీ బదిలీ వ్యవహారం మచ్చుతునకగా మారింది. ఇటీవల ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఒంగోలు డీఎస్పీగా అశోక్‌వర్ధన్ బాధ్యతలు చేపట్టగా ఆ వెంటనే ఆయనను దర్శికి బదిలీ చేశారు. అక్కడ డీఎస్పీ నారాయణస్వామిరెడ్డిని ఒంగోలుకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ససేమిరా అనటంతో సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు పోలీసు ఉన్నతాధికారులు బదిలీ ఉత్తర్వులు మార్చేశారు. వివిధ రకాల సమస్యలపై అలకబూని పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ పదవికి బాలినేని రాజీనామా చేయటం, ఆపై సోమవారం (మే 1, 2023) సీఎం జగన్‌తో భేటీ అయిన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా ఒంగోలు డీఎస్పీపై బాలినేని సూచించిన వారికే అవకాశం ఇవ్వాలని ఉన్నతాధికారులకు సూచించారు. అయితే అనూహ్యంగా గురువారం రాత్రి అశోక్‌వర్ధన్ ఒంగోలు డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. కొద్దిసేపటికే జిల్లా పోలీసు ఉన్నతాధికారులు అశోక్‌వర్ధన్ బాధ్యతలు తీసుకున్న విషయాన్ని అధికారికంగా వెల్లడించవద్దన్న సమాచారం పంపారు. అందిన సమాచారం మేరకు.. అప్పటికే డీజీపీ బాలినేనితో మాట్లాడినట్లు తెలిసింది.డీఎస్పీ విషయంలో తాను వెనక్కు తగ్గనని, తాను తాజాగా సూచించిన దర్శి డీఎస్పీ



నారాయణస్వామిరెడ్డిని ఒంగోలుకు మార్చి మీరు కావాలంటే అశోక్‌వర్ధన్‌ను దర్శికి వేసుకుంటే అభ్యంతరం లేదని స్పష్టం చేసినట్లు సమాచారం. ఆ తర్వాత ఉన్నతాధికారుల నుంచి నూతన బదిలీ ఉత్తర్వులు వస్తాయని వేచి ఉండాలని మౌఖిక ఆదేశాలు జిల్లా పోలీసు అధికారులకు అందాయి. దీంతో ఒంగోలు డీఎస్పీగా అశోక్‌వర్ధన్ బాధ్యతలు తీసుకున్న విషయాన్ని ప్రకటించకుండా ఆపేశారు. మరోవైపు డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు రాగానే ఒంగోలు డీఎస్పీగా బాధ్యతలు చేపట్టేందుకు నారాయణస్వామిరెడ్డి ఆగమేఘాలపై సిద్ధమవటం విశేషం. అయితే విజిలెన్స్ నుంచి అశోక్‌వర్ధన్ రిలీవ్ అయి మూడురోజులు పూర్తయినందున నిబంధనల మేరకే బాధ్యతలు తీసుకున్నారని అంటున్నారు. ఏది ఏమైనా కీలకమైన డీఎస్పీ స్థాయి అధికారి బదిలీ ఉత్తర్వులు ఆగమేఘాలపై మారటంతో పవర్ దెబ్బ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చునన్న వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

# వైసీపీలో పెను ప్రకంపనలు రేపుతున్న కోటంరెడ్డి కామెంట్స్..



## త్వరలోనే అంతా చెప్పేస్తానంటూ సంచలనం..

విజయవాడ మే 5 వైసీపీ నుంచి సస్పెండ్ చేయబడిన ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మీడియా ముందుకొస్తే చాలు.. ఆయన ఏం సంచలన విషయాలు బయటపెడతారో అని అధికార పార్టీలో ఒక్కటే టెన్షన్. పార్టీ నుంచి తొలగించక ముందు, ఆ తర్వాత కోటంరెడ్డి మీడియా ముందుకొచ్చిన ప్రతీసారి అధికార పార్టీపై చేసిన కామెంట్స్ రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమే అయ్యాయి. ఆ తర్వాత అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యల కోసం పోరాడిన ఆయన.. ఇప్పుడు నెల్లూరు నుంచి రాజమండ్రికి వెళ్లారు. ఇటీవల టీడీపీ మహిళా ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ భర్త వాసు, మామ అప్పారావులను ఏపీ సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న కోటంరెడ్డి.. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మద్దతుగా నిలిచారు. ఇంతవరకూ అంతా ఓకే కానీ రాజమండ్రిలో మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే చేసిన కామెంట్స్ ఇప్పుడు వైసీపీలో పెను ప్రకంపనలు రేపుతున్నాయి. ఇంతకీ ఆయన ఏమన్నారు..? ఏ పార్టీలో చేరబోతున్నారు..? ఎప్పుడు చేరబోతున్నారు..? అనే విషయాలు ఈ కథనంలో చూద్దాం..ఆదిరెడ్డి అప్పారావు, వాసును అరెస్టు చేయడాన్ని కోటంరెడ్డి తీవ్రంగా ఖండించారు. వైసీపీ.. అక్రమ కేసులు బనాయించి రాజకీయ కక్ష సాధింపు చర్యలు చేపడుతోందని మండిపడ్డారు. 'ప్రజలకు మేలు చేయాలే గానీ కేవలం కక్ష సాధింపు చర్యలు సరికావు. దుష్ట సంప్రదాయాలు మంచిది కానే కాదు. ఆదిరెడ్డి ఏ తప్పు చేయకున్నా కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారు. ఇవి ప్రభుత్వాలు కొనసాగిస్తే ప్రజాస్వామ్యంలో సరికాదు. అధికారం చేతిలో ఉంది కాబట్టి వేదిస్తానంటే ఎలా..?. రాజ్యాధికారం ఒకరికే శాశ్వతం కాదు. రాష్ట్రానికి రాజధాని ఒక్కటే ఉండాలి. మధ్యలో ఉండే ప్రాంతం అమరావతి. రాజధానిపై చంద్రబాబు ఒక్కరే నిర్ణయం తీసుకోలేదు. అసెంబ్లీలో తీసుకున్న నిర్ణయం ఇది. జగన్ కూడా అమరావతిని అసెంబ్లీలో ఆమోదించారు. ఆ రోజున జగన్ ఎందుకు వ్యతిరేకించలేదు..?. అందరం అమరావతి రాజధాని అని వైసీపీ ఎన్నికలలో చెప్పినమాటను మరోసారి నేను గుర్తు చేస్తున్నా. మూడు రాజధానులు రాష్ట్రానికి సరికాదు.. అక్కర్లేదు. అమరావతి రైతులు ప్రభుత్వాన్ని చూసి భూములిచ్చారు. ఈ రోజు నేను ఒక స్వేచ్ఛాయుత వాతావరణంలో ఉన్నాను. ఇష్టారాజ్యంగా పాలన చేస్తే అధికారులూ ఇబ్బంది పడతారు.. ఇది సభ్యసమాజం హర్షించదు' అని లాజిక్‌లు వెతికి మరీ వైసీపీపై కోటంరెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు.ఆదిరెడ్డి భవానీ కుటుంబ సభ్యులను పరామర్శించిన తర్వాత 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో కోటంరెడ్డి ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా వైసీపీపై కీలక వ్యాఖ్యలు చేశారు. 'టీడీపీ, జనసేనలు టికెట్లు ఇచ్చేందుకు అంగీకారం తెలిపితే వైసీపీ నుంచి 60-70 మంది ఎమ్మెల్యేలు బయటకొస్తారు. జగన్ కక్షసాధింపు చర్యలన్నింటినీ ప్రజలు గ్రహిస్తున్నారు. 2024 ఎన్నికల్లో ప్రజా సునామీ రాబోతోంది. పట్టభద్రులు ఇచ్చిన తీర్పునే ప్రజలూ ఇస్తారు. రాజమండ్రిలో చంద్రబాబు జైలు పర్యటనకు అడ్డంకులు సృష్టించటం దుర్మార్గం' అని కోటంరెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. శ్రీధర్ రెడ్డి కామెంట్స్ ఇప్పుడు అటు వైసీపీలో.. ఇటు మీడియా, సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయ్యాయి. ఇంతకీ ఆ 60-70 మంది ఎమ్మెల్యేలు ఎవరు..? ఇందులో నిజానిజాలెంత..? ఆయన ఏదో మాట్లాడాలని అలా కామెంట్స్ చేశారా.. లేకుంటే నిజమే చెబుతున్నారా..? అని తెలుసుకునే పనిలోవైసీపీ పెద్దలు, ఐ ప్యాక్ టీమ్ ఉన్నారట.ప్రస్తుతానికి తాను వైసీపీకి దూరంగా ఉన్నానని.. పలు పార్టీలు నుంచి ఆహ్వానాలు వచ్చినా ఆసక్తిగానే ఉన్నట్లు చెప్పుకొచ్చారు. ఇప్పటికైతే ఏ పార్టీలో చేరలేదని.. టీడీపీలో ఎప్పుడు చేరతాననే విషయంపై త్వరలోనే క్లారిటీ ఇస్తానన్నారు. కాగా అంతకుముందు టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిని కోటంరెడ్డి కలిశారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ఇద్దరూ సుమారు అరగంటకు పైగా చర్చించుకున్నారు. రాజమండ్రిలో ఏ ఇద్దరు చూసినా ఈ భేటీపైనే చర్చించుకుంటున్నారు. మొత్తానికి చూస్తే.. ఇవాళ ఏపీ రాజకీయాల్లో కోటంరెడ్డి హాట్ టాపిక్ అయ్యారు. ఆయన మాట్లాడిన మాటలు వైసీపీని షేక్ చేస్తున్నాయని విశ్వసనీయవర్గాల సమాచారం. కోటంరెడ్డి ఇన్ని కామెంట్స్ చేసినా వైసీపీ నుంచి ఇంతవరకూ కౌంటర్ రాకపోవడం చూస్తుంటే ఆయన మాటల్లో నిజముందో లేదో అర్థం చేసుకోవచ్చని ప్రతిపక్ష పార్టీల నేతలు చెబుతున్నారు. కోటంరెడ్డి మాటల్లో నిజానిజాలెంతో తెలియాలంటే మరికొన్ని వేచి చూడాల్సిందే మరి.

# ముందస్తు అరెస్టులను ఖండించిన ఈటల

హైదరాబాద్ మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా ముందస్తు అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. ఎక్కడో హుస్నాబాద్, హన్మకొండలో మంత్కరి పర్యటిస్తే హుజురాబాద్ లో అరెస్టులు చేయడం ఏంటి ? పోలీసు రాజ్యం నడిపిస్తున్నారా ? అంత భయం ఎందుకని నిలదీసారు. పోలీస్ బూట్ల చప్పుళ్ళ పహారాలో పర్యటిస్తున్న మీరు ప్రజల విశ్వాసం కోల్పోయారు. నియంతల్లా వ్యవహరిస్తున్నారు. తగిన మూల్యం చెల్లించక తప్పదు. అరెస్ట్ చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని అయన డిమాండ్ చేసారు. .

# సజ్జన సాంగత్యమే మేలు ! (ఆధ్యాత్మిక చింతన )

తిరుమల,మే5 : మంచి వ్యక్తులతో స్నేహం... ఎప్పుడూ సత్యమే పలికేలా చేస్తుంది. బుద్ధి మాంద్యాన్ని తొలగిస్తుంది. జ్ఞానాన్ని పెంచుతుంది. సమాజంలో గౌరవాన్ని కలిగిస్తుంది. కల్మషాలను పోగొడుతుంది. మనసును నిర్మలంగా ఉంచుతుంది. పేరు ప్రతిష్టలు పెరిగేలా చేస్తుంది. మనోవికాసాన్ని కలిగిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే... సజ్జనులైన వారి సాంగత్యం సకలార్థ సాధనం అని పెద్దలు చెబుతారు. అలా ప్రతి ఒక్కరిని ప్రేమించగలగాలి. ప్రేమ అంటే ఇరువురు స్త్రీ పురుషుల మధ్య ఉండేదేనా, ఉద్భవించేదేనా? కాదు. ప్రేమకు పరిమితి లేదు. హద్దుల్లేవు. గోడలు, పై కప్పు, తలుపులు, తాళాలు... ఏమీ లేవు. స్వేచ్ఛగా, ఎప్పటికీ రెక్కలు తెగని పక్షిలా దిగంతాలకు, అనంతాలకు ఎగిరిపోయే ఒక అమృత కెరటం. అయితే అది అపురూపమైనదే గానీ ఎవరికీ అందుబాటులోకి రానిది మాత్రం కాదు. దాన్ని అందరూ అనుభవించవచ్చు. అనుభూతించవచ్చు. అదే దాని ప్రత్యేకత. నిజానికి ఈ లోకం ఇంత సజావుగా నడుస్తోందంటే దానికి కారణం, మూలం... ప్రేమే. ప్రేమ... భగవంతుడి ప్రతిరూపమే. ఆయన కల్యాణ గుణమేఇంత అద్భుతమైన ప్రేమను నిత్యజీవితంలో అనుభవిస్తున్న లోకం ఎంతో ఆనందంలో ఓలలాడాలి కదా... మరి ఈ దుఃఖం ఏమిటి, ఈ విషాదం ఏమిటి? మనుషుల్లోని స్వార్థం, మూర్ఖత్వం, దురాశ... ఈ దుర్గుణాలవల్ల వంచనకు గురవుతున్నామన్న సత్యం అమాయకులమైన మనకర్థం కాదు. అర్థమయ్యేసరికి మన జీవితమే ముగిసిపోతుంది.

## సుంకలమ్మ అమ్మ వారి జాతరలో ఎమ్మెల్యే



నంద్యాల మా ప్రతినిధి మే 5 విభారె న్యూస్ :-నంద్యాల జిల్లా మహానంది మండల కేంద్రంలో సుంకులమ్మ అమ్మవారి జాతర మహోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి. పాల్గొన్నారు. గ్రామంలో కొలువైన అమ్మవారిని దర్శించు కున్నారు అనంతరం మహానంది గ్రామ వైస్సార్సీపీ నాయకుల స్వగృహాలకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి వారి ఆతిథ్యం స్వీకరించారు.. అనంతరం మహనంది క్షేత్రంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి. శ్రీశైలం వైయస్ ఆర్ సీపీ సమన్వయ కర్త భువనేశ్వర రెడ్డి . మార్కెట్ ప్రసాద్ పలు వివాహ కార్యక్రమాలలో పాల్గొన్నారు. వీరి ఆత్మీయ కలయికను చూసి రాజకీయ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.

## అభివృద్ధి పనులు అమలు జరపడంలో నిర్లక్ష్యం చేసిన అధికారులపై కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తాం



నంద్యాల మా ప్రతినిధి మే 5 విభారె న్యూస్ :-ఆళ్లగడ్డ నియోజకవర్గం రుద్రవరం మండలం పెద్దకమ్ములూరు గ్రామ అభివృద్ధికి పోరాటాల ద్వారా సాధించుకున్న 70 లక్షల రూపాలను గ్రామంలో రోడ్డు నిర్మాణాలు ఇతర పనులు మొదలు పెట్టకపోతే అధికారులకు ఆందోళనతో తగిన గుణపాఠం చెబుతామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. .. పెద్ద కంబలూర్ గ్రామంలో సిపిఐ పార్టీ శాఖ ఏర్పడిన తర్వాత ఆ గ్రామంలో గ్రామ అభివృద్ధి కోసం అనేక పోరాటాలు నిర్వహించి సాధించిన సందర్భాలు అనేకం ఉన్నాయని గ్రామంలో బస్సు సౌకర్యం కోసం రోడ్డు నిర్మాణం చేపట్టాలని హైకోర్టు న్యాయవాది. ఏఐవైఫ్ ఉమ్మడి రాష్ట్ర పూర్వ అధ్యక్షులు. స్థానికులు పి.నరసింహులు ఆమరణ నిరాహార దీక్ష చేపడితే స్పందించిన అధికారులు 70 లక్షల రూపాయలు నిధులు మంజూరు అయినప్పటికీ నాటి నుండి నేటి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టకపోగా నిధులు ఏమైనాయని ప్రశ్నించిన సమాధానం చెప్పకపోవడంతో సిపిఐ నాయకత్వంలో కోర్టును ఆశ్రయించడం జరిగిందని అన్నారు. . ఇప్పటికైనా గ్రామంలో అధికారులు అధికార పార్టీ నాయకులు నిధులపై నిర్లక్ష్యం విడకపోతే జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులను కలిసి వివరిస్తూ పెద్ద ఎత్తున ఆందోళన చేసేందుకు సన్నద్ధమవుతున్నామని నాయకులు తెలిపారు.

## పాణ్యం టూ నంద్యాల ఆటో కార్మికులకు యూనిఫామ్ పంపిణీ



నంద్యాల మా ప్రతినిధి మే 5 విభారె న్యూస్ :-నంద్యాల పట్టణంలోని జంబులా పరమేశ్వరి దేవస్థాన కళ్యాణ మండపంలో శుక్రవారం నాడు నంద్యాల టు పాణ్యం తిరిగే ఆటో కార్మికులకు మేడే సందర్భంగా డి.ఎస్.పి. ఆర్టీవో. చేతుల మీదగా 30 మంది ఆటో కార్మికులకు యూనిఫాం పంపిణీ చేయడం జరిగిందని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ సహాయ కార్యదర్శి జి సోమన్న ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు నాయకులు నారాయణరెడ్డి పీఎం రమేష్ తెలిపారు. అనంతరం డి.ఎస్.పి మహేశ్వర రెడ్డి ఆర్టీవో శివారెడ్డి మాట్లాడుతూ నంద్యాల టు పాణ్యం తిరిగే ఆటో కార్మికులు మంచి కార్యక్రమం నిర్వహించినారు. అందుకు అభినందిస్తున్నాము పట్టణములోని అన్ని సెంటర్లలో ఉన్న ఆటో కార్మికులు వీరిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా ఆటో కార్మికులు మద్యం సేవించి ఆటోలు నడపరాదని.ఓవర్ లోడ్ తో ప్రయాణికులను ఎక్కించుకొని ఆటోలు నడప రాదని. ఓవర్ స్పీడ్ తో ఆటోలు నడపరాదని.ఆటోలో ఎక్కిన ప్యాసింజర్లతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి తమ తమ గమ్యస్థానాలకు చేర్చాలని అన్నారు.కొంతమంది ఆకతాయిలు ఆటోలను బాడుగలకు తీసుకుని అరాచకాలకు పాల్పడుతున్నారు. అటువంటి వారితో జాగ్రత్తగా ఉండాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల టు పాణ్యం తిరిగే ఆటకార్మికులకోటీశ్వరరావు. విలియున్. హుస్సేన్ అయ్య. కొళాయి. మహేష్.రంగా.మద్దిలేటి.పవన్ .ఏ పవన్.శంకర్ .తదితరులు పాల్గొన్నారు.

## రామచంద్రపురం సమీపంలో ట్రాక్టర్ బోల్తా

తిరుపతి తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం నెత్త కుప్పం సమీపంలో మామిడికాయల లోడ్ తో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. ఘటనలో ఇద్దరు మృతి చెందారు.

నలుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. మృతులు విద్య శ్రీ(25), ఎర్రబ్బ (45). మృతులు వడమాల పేట మండలం అబ్బీ కండ్రిగకు చెందినవారుగా గుర్తించారు. మామిడికాయల లోడ్ తిరుపతి మార్కెట్ కి తీసుకుపోతున్న మార్గ మద్యంలో ఘాట్ రోడ్డులో ట్రాక్టర్ పికప్ తగ్గిపోవడంతో ప్రమాదానికి కారణం అయింది.

# ఏ.ఆర్ సిబ్బంది పట్టుదలతో ఈ మొబిలైజేషన్



నంద్యాల మా ప్రతినిధి మే 5 విభారె న్యూస్ :- నంద్యాల జిల్లా సాయుధ పోలీసు బలగాలు ఏర్పాటు చేసిన "మొబిలైజేషన్ " ముగింపు కార్యక్రమం నంద్యాల పట్టణం లోని గవర్నమెంట్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ కె.రఘువీర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ ఈ కార్యాక్రమంలో పాల్గొన్న కానిస్టేబుల్ నుండి ఆఫీసర్ అందరినీ జిల్లా ఎస్పీ గారు అబినందించారు. ఎందుకనగా మనకున్నసౌకర్యాలను ఉపయోగించుకొని చాలా విజయవంతంగా మీరు మొక్కవోని ధైర్యం, పట్టుదల,అకుంటిత దీక్ష తో రెండు ఫేస్ లుగా ఈ మొబులైజేషన్ కార్యాక్రమం నివహించడం నిర్విఘ్నగా విజయవంతంగా ముగించుకోవడం చాలా సంతోషంగా మరియు గర్వంగా ఉంది అని తెలియజేశారు. సిబ్బంది మరియు అదికారులు మొత్తం 274 మంది పాల్గొన్నారు. సిబ్బంది అదికారులు అందరూ నిత్య విధ్యార్థులుగా ఉండాలని సమాజంలో ,చట్ట పరిదిలో

### జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి

జరుగుచున్న మార్పులు శాంతిభద్రతలో కొత్తగా తలెత్తే సమస్యలపట్ల అవగాహన కలిగి ఉండాలని వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని నిరంతరం మన వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని రాబోయే రోజులలో మన విధులలో మనం ఎదుకొనబోయే అవరోదాలను అదిగమించే విదంగా వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలని తెలియజేశారు. నంద్యాల జిల్లా ఏర్పడిన తర్వాత మొదటిసారిగా ఈ మొబలైజేషన్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. దీనిని జిల్లా సాయుధ పోలీసు బలగాలు సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ జిల్లా పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని సిబ్బందికి తెలియజేశారు. ఏ.ఆర్ సిబ్బందికి ప్రతీ ఏటా మొబలైజేషన్ కార్యక్రమం అనేది ఒక రీఫ్రెష్మెంట్ కోర్స్ లాంటిదని మీాదైనందిన విధులలో మెరుగుపరుచుకునేందుకు విధులలో నైపుణ్యం, ఫిజికల్ ఫిట్ నెస్ ను మెరుగుపరచడం జరగాలని,ఉద్యోగంలో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న తర్ఫీదు అంశాలను మరోసారి గుర్తు చేసుకుంటూ మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుకునేందుకు ఈ మొబలైజేషన్ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు.ఈ సందర్భంగా ఏఆర్ సిబ్బంది మొబలైజేషన్ కార్యక్రమంలో సిబ్బంది ఆయుధాల భాగములను విభజించడం మరియు జోడించడం కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షించారు ఇందులో మెలకువలను సూచనలను వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు అడిషనల్ ఎస్పీ ఆర్. రమణ , ఏ.ఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు ,నంద్యాల డిఎస్పీ మహేశ్వర్ రెడ్డి ,ఆత్మకూరు శ్రీనివాసరావు ,మరియు దిశ పోలీసు స్టేషన్ డీయస్పీ మారుతీరావు ,ఏ.ఆర్ డీయస్పీ రంగముని , రిజర్వు ఇన్స్పెక్టర్ సుధాకర్ , ఆర్ యస్ ఐలు . అల్లావుద్దీన్ ,వీరన్న ,సోమశేఖర్ ,హర్షవర్ధన్ రెడ్డి , రాముడు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటి వద్దకే సంక్షేమం పథకాలు



నంద్యాల మా ప్రతినిధి మే 5 విభారె న్యూస్ :- నంద్యాల పట్టణంలో . 99 వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం లో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డికి హారతులతో స్వాగతం పలికిన 42 వ వార్డు

### ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి

మహిళలు. నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 42 వార్డు తెలుగు పేటలో 99వ రోజు వార్డు కౌన్సిలర్ పి శిరీష వార్డు ఇన్చార్జి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం లో నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పాల్గొన్నారు. వార్డులో ఉన్న లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల కరపత్రాలను అందించారు. ముఖ్యంగా వైయస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిజమైన పేదవారికి సంక్షేమ పథకాలు వారి ఇంటి వద్దకే వస్తున్నాయి. ఇంతటి బహోత్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ మహాబున్నిసా. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ , మున్సిపల్ వైస్ చైర్మన్ పామ్ షావలి, కుమ్మరి రాముడు, 23 వ వార్డు ఇన్చార్జి రహంతుల్లా, 27వ వార్డు ఇంచార్జ్ దేవ నగర్ బాషా, 30 మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ మరియు వార్డు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైఎస్సార్ కళ్యాణమస్తు, 419 మంది లబ్ధిదారులకు 3,21,85,000 రూపాయలు జమ



నంద్యాల మా ప్రతినిధి మే 5 విభారె న్యూస్ :-జిల్లాలో వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల కింద రెండవ విడతలో అర్హులైన 419 మంది లబ్ధిదారులకు 3,21,85,000 రూపాయలు జమ చేశామని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వైఎస్సార్ కళ్యాణమస్తు/వైఎస్సార్ షాదీ తోఫా కింద జనవరి, మార్చి - 2023 త్రైమాసికంలో వివాహం చేసుకున్న 12,132 మంది అర్హులైన లబ్ధిదారులకు 83,49,30,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమ చేసారు. నంద్యాల కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని

### జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్

సమూన్, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్, మార్క్ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, మైనారిటీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి, సంక్షేమ శాఖ డిడి చింతామణి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ నూతనంగా వివాహం చేసుకున్న పేద జంటల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల కింద నంద్యాల జిల్లాలో రెండవ విడతలో అర్హులైన 419 మంది లబ్ధిదారులకు 3,21,85,000 రూపాయలు జమ చేశామన్నారు. గత ఫిబ్రవరి మొదటి విడతలో 273 మంది లబ్ధిదారులకు 2,34,20,000 రూపాయలు జమ చేశామన్నారు.జనవరి?మార్చి త్రైమాసికంలో పెళ్లి చేసుకున్న ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 51 మంది లబ్ధిదారులకు, బనగానపల్లిలో 57 మందికి, నందికొట్కూర్ లో 85 మందికి, డోన్ లో 87 మందికి, నంద్యాలలో 53 మందికి, పాణ్యంలో 25 మందికి, శ్రీశైలంలో 61 మంది వెరసి మొత్తం 419 మంది లబ్ధిదారులకు 3,21,85,000 రూపాయలు పెళ్లికూతుర్ల తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేయడం జరిగిందన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, మార్క్ఫెడ్ చైర్మన్ తదితరుల చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కును అందజేశారు.

## నిరుద్యోగ సమస్యలపై మాట్లాడాలి

### నారా లోకేష్ కు వినతి పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్



కర్నూలు, మే 5విభారె న్యూస్ : నిరుద్యోగ సమస్యపై యువగలం పాదయాత్రలో మాట్లాడాలని ప్రగతిశీల యువజన సంఘం పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ అన్నారు.స్థానిక పెద్దపాడు దగ్గర యువతరం పాదయాత్రలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తో మాట్లాడడం జరిగింది. సమస్యలతో కూడిన వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 2లక్షల 35వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి కానీ రాష్ట్ర ప్రభుత్వం యువత నిరుద్యోగులపై కక్ష సాధింపు చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని చెప్పి నేటికీ ఒక పోస్ట్ కూడా విడుదల చేయకపోవడం దుర్మార్గమని సందర్భంగా వివరించారు. అదేవిధంగా ఓర్వకల్ మండల కేంద్రంలో విమానాశ్రయంలో, పరిశ్రమల్లో 70% స్థానికులకు ఉద్యోగాలు అవకాశం కల్పించాలని దీనిపై యువగళం పాదయాత్రలో మాట్లాడాలని అన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలుపై తెలుగుదేశం పార్టీ వైఖరి చెప్పాలని ఈ సందర్భంగా యువగళం పాదయాత్రలో కోరారు. రాష్ట్రంలో విద్యార్థి యువజన సంఘాలు జరిగే నిరుద్యోగ పోరాటంలో ప్రతిపక్షంగా పోరాటం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి వై ఎల్ నగర కార్యదర్శి రాము నాయకులు సురేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు...

## శ్రీ కపిలేశ్వరాలయంలో వైభవంగా పత్ర పుష్పయాగం

తిరుపతి, మే 5 తిరుపతి శ్రీ కపిలేశ్వరాలయంలో శుక్రవారం పత్రపుష్పయాగం వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి, అభిషేకం నిర్వహించారు. ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు శ్రీ కపిలేశ్వర స్వామివారు, శ్రీ కామక్షి అమ్మవారి ఉత్సవర్లకు నవ కలశ స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పంచామృతాభిషేకం, చెరుకు రసం, కొబ్బరినీళ్ళు, విబూది, పసుపు, చందనంలతో అభిషేకం చేశారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పత్ర పుష్పయాగ మహోత్సవం జరిగింది. ఇందులో చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, జాజి, రోజా, తామర, మల్లి, వృక్షి, కనకాంబరంలతో పాటు బిల్వ పత్రం, తులసి, పన్నీరు ఆకులతో స్వామి, అమ్మవార్లకు పత్ర పుష్ప యాగం నిర్వహించారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుల నుండి దాతలు 3 టన్నులు పుష్పాలు, పత్రాలు విరాళంగా అందించారు. ఇందులో 12 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలు ఉన్నాయి. ఆలయంలో అర్చక పరిచారకుల వల్ల, అధికార అనధికారుల వల్ల, భక్తుల వల్ల ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పత్ర పుష్పయాగం నిర్వహిస్తారని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ భూపతి పాల్గొన్నారు.

## ముగిసిన వెంగమాంబ 293వ జయంతి ఉత్సవాలు

### - వెంగమాంబ విగ్రహానికి పుష్పాంజలి

తిరుపతి, మే 05 తిరుపతిలో రెండు రోజులపాటు జరిగిన భక్త కవయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 293వ జయంతి ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఎం.ఆర్.పల్లి సర్కిల్ వద్ద ఉన్న మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ విగ్రహానికి టీటీడీ అధికారులు ఉదయం పుష్పాంజలి సమర్పించారు. అన్నమాచార్య కళామందిరంలో ఉదయం 10 గంటలకు అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు మధుసూదన రావు బృందం సంగీత సభ జరిగింది. ఉదయం 11.30 గంటలకు చంద్ర శేఖర్ భాగవతార్ హరికథ గానం నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు ఎస్వీ సంగీత నృత కళాశాల ఆధ్యాపకులచే నృత్య కార్యక్రమం జరుగనుంది.తరిగొండలో... తరిగొండ శ్రీ లక్ష్మీనృసింహస్వామివారి ఆలయంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు శ్రీ లక్ష్మీనృసింహస్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది.

# ప్రతి నిత్యం భగవంతుని నామస్మరన చేస్తూ ఉండాలి

### ప్రతి ఒక్కరూ దానధర్మాలు చేయాలి

### గ్రామాలలోని ఆలయాలలో ధూప దీప నైవేద్యంతోపాటు భజన కార్యక్రమాలు నిర్వహించాలి

### నదులు కాలుష్యం చేయకుండా కాపాడాలి

### ప్రజలకు మంచి సంకల్పం కలగాలి

### Xచిత్తూరు జిల్లాలో అనేక పుణ్య తీర్థాలు ఉన్నాయి

### : కంచి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజేయేంద్ర సరస్వతి

తిరుపతిఘనంగా మహా అద్భుతంగా శ్రీ తాతయ్య గుంట గంగమ్మ కు మహా కుంభాభిషేకం లో భాగంగా 5 వ రోజు అమ్మవారి విగ్రహ పున: ప్రతిష్ట, కలశ ప్రతిష్ట నిర్వహించి సర్వ దర్శన భాగ్యం భక్తులకు కల్పించిన కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజేయేంద్ర సరస్వతి స్వామి వారు.తిరుపతి శ్రీ తాతయ్య గుంట గంగమ్మ తల్లి విగ్రహ పున: ప్రతిష్ట మహా కుంభాబిషేకం కార్యక్రమంలో భాగంగాశుక్రవారం ఉదయం శ్రీ తాతయ్య గుంట గంగమ్మ ఆలయం చేరుకున్న కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజేయేంద్ర సరస్వతి స్వామి వారికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీమతి ఆర్. కె.రోజా,స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ఆలయ మర్యాదలతో సాంప్రదాయ బద్దంగా స్వాగతం పలికారు. పీఠాధిపతి ముందుగా యజ్ఞ శాలలో నిర్వహించే హోమం కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా నిర్మించిన గర్భాలయం లో గంగమ్మ తల్లి విగ్రహ పున: ప్రతిష్ట చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గర్భాలయం శిఖర కలశ ప్రతిష్ట మహాకుంభ సమర్పణ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా పీఠాధిపతి భక్తులనుద్దశించి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అలయాలు పున : నిర్మాణాలు చేపట్టి కుంభాభిషేకాలు నిర్వహించాలని అప్పుడే గ్రామం,జిల్లా, రాష్టం, దేశం సుభిక్షంగా ఉంటుందని చూచించారు. గంగ పురస్కారాలు సందర్భంగా తిరుపతి లో గంగమ్మ తల్లికి మహా కుంభాభిషేకం నిర్వహించడం శుభ సూచకమని తెలిపారు. ప్రతి ఒక్కరు నిత్యం భవంతుని జపిస్తూ ఉండాలని, అందరూ మంచి సంకల్పం కలిగి ఉండాలి అది మీాకు సమాజానికి మంచిగా ఉపయోగపడుతుందన్నారు. కుంభాభిషేకం ముఖ్య ఉద్దేశం గురించి 18వ శతాబ్దంలో కంచి కామాక్షమ్మ ఆలయంలో తెలుగులో ఇలా రాసి ఉంది "కుంబాభిషేకం చేసి న సకల జనులు సంతోషించెదరు " అని రాసి ఉంది,తిరుపతి లో గంగమ్మకు కుంభాభిషేకం చేశారు తిరుపతి ప్రజలందరూ సంతోషంగా వున్నారు.దేశంలో ఉండే తీర్థా క్షేత్రాలను మంచిగా శుభ్రంగా అందంగా ఉండే డానికి సకల జనులు సహకరించాలన్నారు. గ్రామాలలో ఉన్న ఆలయాలలో ధూప దీప నైవేద్యాలు , కుంభాభిషేకాలు , హోమాలు చేయడం వల్ల పుష్కలంగా వర్షాలు కురుస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష,ఉప మేయర్ భూమన అభినయ రెడ్డి,ఆలయ ఈఓ ముని కృష్ణయ్య, ఆలయ ఛైర్మన్ శ్రీ కట్టా గోపి యాదవ్, ధర్మకర్తల మండలి టి. వెంకటేశ్వరరావు, యం. హరినాథ్ రెడ్డి, టి. రమణమ్మ, , పి. ధన శేఖర్, వి. కృష్ణమ్మ, వి. గీత, యన్. భారతి , స్థానిక భక్తులు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190